# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## అధికారుల్ని అడ్డుకున్న ఎయిర్‌పోర్ట్‌భూముల రైతులు

### - ఓ రైతు ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో చేరిక !!



శాంతిపురం, మార్చి 11 ప్రభాతవార్త

ఎయిర్‌పోర్టు కోసం గుర్తించిన భూములకు సంబంధించి రైతులతో మాట్లాడేందుకు రెవెన్యూ అధికారులు వెళ్లగా అమ్మవారిపేట, దండికుప్పం, సొన్నేగానిపల్లి రైతులు అధికారులను అడ్డుకున్నారు. కాగా అధికారులు సర్వేకు వస్తున్నారని భావించిన దండికుప్పంకు చెందిన రైతు వెంకటప్ప ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. ప్రస్తుతం అతను పిఇఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాము ఎలాంటి పరిస్థితుల్లోను ఎయిర్‌పోర్టుకు భూములు ఇవ్వమని పేర్కొన్నారు. రైతు వెంకటప్పకు కేవలం 71సెంట్ల భూమి మాత్రమే ఉందని సమాచారం. తహశీల్దార్ ప్రకాష్‌బాబు రైతులను మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణిరెడ్డి సమక్షంలో నచ్చజెపే ్పందుకు ప్రయత్నించారు. వాళ్లు ససేమిరా అనడంతో చేసేది లేక వెను తిరిగారు. కార్యక్రమంలో సర్వేయర్లు, విఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

## శివయ్యను దర్శించుకున్న హంపీ పీఠాధిపతి



శ్రీకాళహస్తి, మార్చి 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హంపీ ద్వారక శారద పీఠాధిపతి గోవిందానంద సరస్వతి దర్శించుకున్నారు. పంచభూత లింగాల్లో వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిధుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం రాగా ఆయనకు ఆలయమర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఇఓ బికె వెంకటేశు, ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలతో పాటు ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ నిరంజన్‌గురుకుల్, దక్షిణామూర్తి లు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, సుబ్రమణ్యంలు పర్యవవేక్షించారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం హంపి పీఠాధిపతికి ఇఓ వెంకటేశు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

### సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

## భక్తి మార్గంలో పయనించాలి

### శృంగేరి పీఠాధి పతి విధుశేఖర్ భారతీ స్వామి



శ్రీకాళహస్తి, మార్చి 11 ప్రభాతవార్త

హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుకుంటూ ప్రతి ఒక్కరుభక్తి మార్గంలో పయనించి భవవంతుని అనుగ్రహానికి పాత్రులు కావాలని శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర్ భారతీ మహాస్వామి పిలుపు నిచ్చారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న గంగాసదన్‌లో ఆయన భక్తులు, ఆలయాధికారుల, ధర్మకర్తల మండలి నాయకులు రాజకీయ నాయకులతో అనుగ్రహ భాషణ నిర్వహించారు. ఉదయం ఇక్కడ చంద్రమౌళీశ్వర పూజలు జరుపుకున్నారు. అనంతరం భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహ భాషణ అందించారు. ఈ సందర్బంగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలతో పలు అంశాలకు సంబంధించి దేవాలయాల అభివృద్ధికి సంబంధించి చర్చించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్వాహకులు ఆయా దివ్యక్షేత్రాల్లో పవిత్రను కాపాడుకుంటూ భక్తి తత్వాన్ని పెంపొందించుకునే రీతిలో ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. ఏ ఆలయంలోనైనా ఆగమ శాస్త్రం ప్రకారం క్రతువులు నిర్వహించాలన్నారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తి దివ్యక్షేత్రం మహిమాన్వితమైనదని స్వామీజి వివరించారు. భక్తితత్వంతో పూజిస్తే భోళా శంకరుడు అనుగ్రహిస్తాడన్నారు. మూగజీవాలతో పాటు ఏ మాత్రం ఆధ్యాత్మిక చింతన లేని భక్తకన్నప్ప ఉదంతాలు నిదర్శనం అన్నారు. .ఈ కార్యక్రమాల్లో నాయకులతోపాటు ఆలయ ఛైర్మెన్ కొట్టెసాయి, ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశు, రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, స్తానిక వేదపండితులు, ఆలయాధికారులు, సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## వ్యవసాయంకు మరింత ప్రోత్సాహం

### ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు- ఫీల్డ్ విజిట్లపై ప్రత్యేక పోర్టల్

### కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబునాయుడు



సిఎం నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, మార్చి 11 ప్రభాతవార్త:

వ్యవసాయంను మరింత ప్రోత్సహించేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని ఆయన ప్రకటించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల కలెక్టర్ల సమావేశం బుధవారం ప్రారంభమైంది. ఈ సమావేశంలో కలెక్టర్లకు సిఎం నారా చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి ప్రజల్లో వీటిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అలాగే ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలపై సిఎం ఆవేదన వ్యక్తం చేస్తూ అధికార యంత్రాంగం నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం లక్షాధికారుల కోసం పని చేయడం లేదని నిరుపేద ప్రజల కోసం పని చేస్తుందనే విషయంను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకు పాలనా అంశాలపై సమీక్ష చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని, ప్రస్తుతం వున్న పరిమిత వనరులతో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలలను బ్యాలెన్స్ చేస్తున్నామన్నారు. గతంలో కార్యాలయంలో కూర్చొని ఫైల్స్ రాసే స్థితి నుండి వర్చువల్ పని విధానం తీసుకువచ్చామని, గత 20 నెలల్లో కీలకమైన పాలనామార్పులు తీసుకువచ్చామన్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా తెచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తే సుపరిపాలన అందించడానికి వీలవుతుందన్నారు. సూపర్ సిక్స్ తో సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని, ఎక్కడ పొరబాట్లు జరగకుండా పారదర్శకంగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం అన్నదాత 3వ విడత నిధులు విడుదల చేస్తున్నామని, కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం రైతు ఖాతాల్లో మిగిలిన సొమ్ము జమ చేస్తుందన్నారు. ఖరీఫ్ సాగు కోసం మే 15వ తేదీన నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అలాగే ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్దిదారులకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తున్నామని, జూన్ నెలలో మరికొన్ని ఇళ్ళను లబ్దిదారులకు ఇవ్వనున్నామన్నారు. ఈ కలెక్టర్ల సమావేశంలో జిల్లా నుండి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఇన్‌ఛార్జీ మంత్రులు, కార్యదర్శులు, మంత్రులు, సిఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నత అధికారులు హాజరయ్యారు.

## టౌన్‌ప్లానింగ్ అక్రమాలపై క్షేత్రస్థాయిలో ఏసిబి పరిశీలన

### -బహుళ అంతస్థుల భవనాల తనిఖీ



తిరుపతి, మార్చి 11ప్రభాతవార్త:

స్థలం కొని భవనం కట్టుకోవాలన్నా డబ్బులివ్వాల్సిందే... నిబంధనలు ఉల్లంఘించి అంతస్థులు నిర్మించుకోవడానికి చేతులు తడపాల్సిందేననే ఫిర్యాదులతో ఏసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్‌లలో టౌన్‌ప్లానింగ్ విభాగంపై రెండోరోజూ ఏసిబి అధికారులు సోదాలు కొనసాగాయి. తిరుపతిలో నగరపాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ విభాగం నిర్ణయించిన బిపిఎస్, బిఆర్ఎస్ రికార్డులు స్వాధీనం చేసుకున్న ఏసిబి బుధవారం నిబంధనలు ఉల్లంఘించిన ఐదు భవనాలను తనిఖీ చేశారు. మంగళంరోడ్డులోని డిమార్టు ఎదురుగా ఉన్న ఓ భవనం, రెండు హోటళ్ళు, మరో మూడంతస్థులు అనుమతి తీసుకుని ఐదంతస్తులు నిర్మించడం వాటి పరిణామాలు, కొలతలు సేకరించారు. ఇవన్నీ నిబంధనల మేరకు, అనుమతుల మేరకే నిర్మాణాలు చేశారా, లేక ఉల్లంఘించి చేసుకున్న వాటిల్లో ఎంత వరకు టౌన్‌ప్లానింగ్ అధికారుల చేతివాటం ఉందనే వివరాలు రాబట్టనున్నారు. ఈ ఏసిబి దాడులు ఇంకా సమగ్రంగా విచారణ చేసే విషయం తెలుస్తోంది. బహుళ అంతస్థుల భవనాలు నిర్మాణాలు, వాటి క్రమబద్ధీకరణ, భవనాల అక్రమాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు వాటిపై నిశితంగా ఏసిబి దర్యాప్తు చేయనుందనేది తెలుస్తోంది. తదుపరి ఎంతవరకు టౌన్‌ప్లానింగ్‌లో సక్రమాలు, అక్రమాలు నిగ్గుతేల్చనున్నారు. నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నారు.

### రోడ్డుప్రమాదంలో

## ఇద్దరు యువకులు దుర్మరణం

### జాతరకు వెళ్లివస్తూ ప్రమాదం

### గ్రామంలో విషాదచాయలు..

పెద్దపంజాణి మార్చి 11 ప్రభాతవార్త :



మండలంలోని రాజుపల్లి పంచాయతీ కమ్మినాయినపల్లెకు చెందిన ఇద్దరుయువకులు పుంగనూరులో జరుగుతున్న గంగమ్మజాతరకు వెళ్లివస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదుచేసిన మేరకు వివరాలిలా. .గ్రామానికి చెందిన వెంకటముని కుమారుడు భరత్‌కుమార్(19), సుబ్రమణ్యం కుమారుడు శ్రీధర్(25) బజాజ్‌పల్సర్ వాహనంలో పుంగనూరుజాతరకు బయలుదేరారని తెలిపారు. బుధవారం వేకువ జామున భరత్‌కుమార్, శ్రీధర్‌లు జాతరచూసుకొని ద్విచక్రవాహనంలో తిరిగివస్తుండగా కత్తార్లపల్లె క్రాస్ సమీపంలో బొలోరోవాహనం వేగంగావచ్చి బజాజ్‌పల్సర్ టూవీలను ఢీకొందన్నారు. దీంతో భరత్ కుమార్, శ్రీధర్‌లు, తమగ్రామానికి చెందిన గిరీష్ ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారన్నారు. భరత్‌కుమార్, శ్రీధర్‌లు తీవ్రగాయలతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. గిరీష్‌కుమార్‌కు కాలువిరగడంతో అతన్ని చికిత్సనిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన బొలొరో వాహనం డ్రైవర్‌పై తగుచర్యలు తీసుకోవాలని మృతుడు భరత్‌కుమార్ తండ్రి వెంకటముని పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతిచెందిన మృత దేహాలను పంచానామాకు తరలించి కేసు నమోదుచేశారు. ఇద్దరు యువకులు ఒకేరోజు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

### అన్న కాంటీన్లలో మరింత

## నాణ్యమైన ఆహార పదార్థాలు

### -దాతలు విరాళాలు ఇవ్వండి : కమిషనర్ మౌర్య



తిరుపతి, మార్చి 11ప్రభాతవార్త:

తిరుపతి నగరంలో నడుస్తున్న అన్న కాంటీన్ల ద్వారా ప్రజలకు మరింత నాణ్యతతో, పరిశుభ్రతతో ఆహార పదార్థాలు అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య సూచించారు. జిల్లాలోని అన్న కాంటీన్ల నిర్వహణ, కమిటీ బాధ్యతలపై సలహా మండలి సభ్యులు, అధికారులతో, అక్షయ పాత్ర ప్రతినిధులు, క్యాంటీన్ నిర్వాహకులతో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఐదు రూపాయలకే నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు అందించేలా ప్రభుత్వం అన్న కాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కాంటీన్ల ద్వారా ఇప్పటికే నాణ్యమైన, పరిశుభ్రతతో కూడిన ఆహార పదార్థలను అందిస్తున్నామని తెలిపారు. నిర్ణీత సమయంలో ఆహార పదార్థాలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కమిటీ సభ్యులు, అధికారులు అన్న కాంటీన్లను పరిశీలించాలని తెలిపారు. ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకుని ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్వాహకులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సాయం అందించేలా దాతలతో సంప్రదించాలని సూచించారు. ఎసలహా మండలి సభ్యులు ఆర్.సి. మునికృష్ణ, ఎస్.కె.బాబు , సి.కె.రేవతి (తిరుపతి), రాధ (పుత్తూరు), ప్రభావతి (వేంకటగిరి), డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవిన్యూ అధికారి సేతు మాధవ్, అక్షయ పాత్ర, హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు శివ గణేష్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ యుద్ధంతో సామాన్యులకు ఇక్కట్లు

### ధర పెరిగిన వాయుబండ.. వంట నూనెలకు రెక్కలు.

### పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు.



చిట్వేలి, మార్చి 11, ప్రభాతవార్త:

బండి నడవాలన్నా, తిండి కావాలన్నా ఇంధనం తప్పనిసరి. అట్టి ఇంధనాన్ని ప్రపంచ దేశాలకు సరఫరా చేసే అరబ్ దేశాలలో గత 12 రోజులుగా జరుగుతున్న యుద్ధ ప్రభావంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే 910 రూపాయలకు లభించే వాయుబండ 60 రూపాయలు పెరిగి 970 రూపాయలకు చేరింది. వంటనూనె ఒక లీటర్ కు 15 రూపాయలు ఒక్కసారిగా పెంచేశారు. వంట నూనెలను నిల్వ చేసుకొని, రిటైల్ షాపులకు విక్రయించే వ్యాపారులు ఇదే అదనగా పెరిగిన ధరలకే తమ దగ్గర ఉన్న నూనెలను అమ్మి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని పర్యవేక్షించవలసిన అధికారులు లోపాయికారీ ఒప్పందాలతో సరిపెట్టుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. పెరిగిన ధర సామాన్యులకు మరింత భారంగా మారింది. దీనితోపాటు బుధవారం స్థానిక చిట్వేలి గ్రామంలో మూడు ఇంధన నిలుపు కేంద్రాలు అందుబాటులో ఉండగా ఒకచోట ఇంధనం లేదంటూ పూర్తిగా మూసి వేశారు. మరోచోట డీజిల్ లభ్యత ఉందని పెట్రోల్ లభ్యత లేదని సూచిక బోర్డు నింపారు. మిగిలిన ఒక్కచోట మాత్రం కొంతమేరకు పెట్రోల్ ఉండడంతో విషయం తెలుసుకున్న మండల ప్రజలు తండోపతండాలుగా పెట్రోలు నింపుకునేందుకు తరలి వచ్చారు. 30 రోజులకు సరిపడా నిలువలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయని డోకా లేదని ప్రకటనలు చేస్తున్నప్పటికీ కేవలం 12 రోజులు కాకముందే ఇందన కొరత ఏమిటని పలువురు ప్రశ్నించారు. కొరతను చూపించి అధిక రేట్లు వినియోగదారులపై మోపెందుకే ఈ విధానం పాటిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తపరిచారు.

## వైసిపి శ్రేణులపై పోలీసులకు ఫిర్యాదు

*తిరుపతి, మార్చి 11ప్రభాతవార్త:*




*టిటిడి ప్రతిష్టను దెబ్బతీసేలా, ఛైర్మన్ బిఆర్‌నాయుడుపై అసత్య ఆరోపణలుతో ఆయన కనబడుట లేదని ఫ్లెక్సీ వేసిన వైసిపి శ్రేణులపై తిరుపతి ఈస్టు పోలీసు లకు ఫిర్యాదు అందింది. వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ ఆర్.సి మునికృష్ణ పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. టిటిడి పరిపాలన భవనం వద్ద ఛైర్మన్ బిఆర్ నాయుడు కనుబడట్లేదని ఫ్లెక్స్ కట్టిన వారిపై, తిరుపతిలో వైసిపీ శ్రేణులు ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని, కరుణాకర్ రెడ్డి హాయంలో వైసిపీ శ్రేణులు టిటిడి ప్రతిష్ఠ, శ్రీవారి పవిత్రతను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నాడు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు టార్గెట్ గా వైసిపీ మూకలు అహంకారపు చేష్టలు చేస్తున్నారని, ఆయన కనుబడుటలేదని ఫ్లెక్సీ కట్టి కరుణాకర్ రెడ్డి ,అతని అనుచరులు చాలా పెద్ద పొరపాటు చేశారన్నారు.*

## గ్రంథాలయాలను సందర్శించిన ఛైర్మన్



*తొట్టంబేడు మార్చి 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి లోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి విచ్చేస్తున్న రీడర్స్ తోను రెడ్డి వారి గురువారెడ్డి సమావేశం అయి గ్రంథాలయంలో పేపర్ల అందుబాటులో ఉన్నాయా పుస్తకాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అదేవిధంగా గ్రంథాలయం సంబంధించిన అన్ని విషయాల గురించి వారి ద్వారా వాకబు చేశారు. కొద్దిసేపు వారితో కలిసి పేపర్ చదివి అదేవిధంగా లైబ్రరీ టైమింగ్స్ కు సంబంధించి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ప్రస్తుతం శ్రీకాళహస్తి తొట్టంబేడు గ్రంథాలయంలో 3,400 మందికి పైన సభ్యులుగా ఉన్నారు. అదేవిధంగా రీడర్స్ సంఖ్య కూడా పెరగాలని అక్కడ ఉన్నటువంటి గ్రంథాల అధికారిని ఛైర్మన్ ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ.హరికృష్ణ, రీడర్స్, విద్యార్థులు , టీచర్ పాల్గొన్నారు.*

### చెంగాళమ్మ ట్రస్టుబోర్డు నియామకంపై

## వీడని సస్పెన్స్

### - తిరుమూరు, అర్వభూమిలో గెలుపెవరిదో ?





సూళ్లూరుపేట, మార్చి 11 ప్రభాతవార్త

ఒక పక్క కోర్టు కేసులు. మరోపక్క పార్టీలో వర్గపోరు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు పూర్తయినా సూళ్లూరుపేట ప్రాంతంలో అత్యంత ప్రాధాన్యత గల శ్రీచెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు నియామకంపై సస్పెన్స్ నెలకొని ఉంది. ఈ సస్పెన్స్‌కు ఎప్పుడు తెరపడుతుందా అని ఈ ప్రాంత ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పార్టీలో సీనియర్ లీడర్ తిరుమూరు సుధాకర్‌రెడ్డికి ఛైర్మన్‌గిరి కట్టబెట్టాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నిర్ణయించుకుని పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేశారు. వీరికి పోటీగా వేనాటి సతీష్‌రెడ్డి తమ కుటుంబం 30 సంవత్సరాలుగా చెంగాళమ్మ సేవలోనే ఉందని, ఈ క్రమంలో తమ కుటుంబానికి ఈ పదవి కేటాయించాలని, తన సోదరుడు వేనాటి సురేష్‌రెడ్డికి పదవి ఇవ్వాలంటూ అధిష్టానం వద్ద పట్టుబట్టారు. అక్కడి నుంచి ఈ విషయం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో 2008 నుంచి ట్రస్టుబోర్డు నియామకాలు జరిగినప్పుడు నేనున్నానంటూ ముందుకు వచ్చే అర్వభూమి చంద్రశేఖర్‌రెడ్డి మళ్లీ తెరపైకి వచ్చారు. వంశపారంపర్య ధర్మకర్త అంటూ సభ్యునిగా తనకు ఉమ్మడి రాష్ట్రంలో హైకోర్టు ద్వారా ఆదేశాలు పొంది ఉన్నానని ఆయన చెప్పారు. అనంతరం హైకోర్టుకు ట్రస్టుబోర్డు నియామకం విషయంపై పిటిషన్ దాఖలు చేశారు. అక్కడి నుంచి ట్రస్టుబోర్డు నియామకంపై ఎటూ తేల్చలేక తెలుగుదేశం అధిష్టానం ఆలోచనలో పడింది. కోర్టు అభ్యంతరాలతో ట్రస్టు బోర్డు నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు.

ఈ నేపథ్యంలో గత వారంరోజులుగా చెంగాళమ్మ ట్రస్టు బోర్డు నియామకానికి పార్టీ అధిష్టాన వర్గం పచ్చజెండా ఊపిందని, త్వరలోనే బోర్డు నియామకం జరుగుతుందని, ఛైర్మన్‌గా తిరుమూరు సుధాకర్‌రెడ్డిని పదవి వరించనుందని బాగా ప్రచారం జరుగుతోంది. ఇంతలోనే అర్వభూమి చంద్రశేఖర్‌రెడ్డి రంగంలోకి వచ్చి అసలు ఇప్పటికీ నేను ఛైర్మన్‌నే, ట్రస్టుబోర్డు నియామకానికి నోటిఫికేషన్ వేయగానే తాను సభ్యునిగా అవుతానని, అనంతరం ఛైర్మన్ పదవి తనకే దక్కుతుందని కోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసిందని చెప్తున్నారు. ఈ విషయంలో తాను ఎవరితో రాజీపడబోనని, తగ్గేదే లేదంటూ ఆయన గట్టి పట్టుదలతో వ్యవహరిస్తున్నారు. ఇదిలావుంటే తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అర్వభూమి చంద్రశేఖర్‌రెడ్డి ఇద్దరికీ తడ మండలం కారిజాత గ్రామం కావడం, ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం విశేషం. ఇదిలావుంటే ట్రస్టుబోర్డు నియామకంలో పార్టీలో రెండు వర్గాలుగా ఏర్పడి పంపించిన ట్రస్టుబోర్డు సభ్యుల జాబితాలో ప్రస్తుతం మార్పులు జరిగాయని పుకార్లు షికారు చేస్తున్నాయి. దీంతో పార్టీలోని కొంతమంది తాము పార్టీ కోసం కష్టపడినా తమను ట్రస్టుబోర్డు నుంచి అకారణంగా తొలగించారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమకు అనుకూలమైన వారికే పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రస్టు బోర్డు నియామకంపై నెలకొన్న సస్పెన్స్ వీడనుంది. లేక కోర్టు అభ్యంతరాలతో అలాగే కొనసాగుతుందా అన్నది వేచి చూడాల్సిందే.

### తిరుపతి ప్రాంతాన్ని

## అరుదైన ఖనిజ కారిడార్‌లో చేర్చాలి

### - ఎంపీ గురుమూర్తి



వెంకటగిరి, మార్చి 11, ప్రభాతవార్త

తిరుపతి ప్రాంతాన్ని ఖనిజ కారిడార్‌లో చేర్చాలని ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. అరుదైన ఖనిజాల అభివృద్ధి, వాటి ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించే అంశంపై పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో అరుదైన ఖనిజాల కారిడార్‌ల ఏర్పాటు, తిరుపతి ప్రాంతాన్ని కూడా అందులో చేర్చే అవకాశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన వివరాలు కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు శాఖతో పాటు ప్రధాన మంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమాధానం ఇచ్చారు. కేంద్ర బడ్జెట్ 2026-27లో ఖనిజ సంపద కలిగిన తీర రాష్ట్రాలైన ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో ప్రత్యేక అరుదైన ఖనిజాల కారిడార్‌ల ఏర్పాటుకు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కారిడార్‌ల ద్వారా దేశంలో అరుదైన ఖనిజాల ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగల శక్తివంతమైన వ్యవస్థను నిర్మించడం లక్ష్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోడియమియం, ప్రసియోడియమియం, సమారియం వంటి అరుదైన ఖనిజాల ఉత్పత్తిని పెంచడం, వాటితో తయారయ్యే అయస్కాంతాల దేశీయ తయారీకి ప్రోత్సాహం ఇవ్వడం లక్ష్యంగా ఉందన్నారు. అలాగే అరుదైన ఖనిజాల తవ్వకం నుండి తయారైన ఉత్పత్తి వరకు జరిగే మొత్తం ప్రక్రియలో రాష్ట్రాలు కీలక పాత్ర పోషించేలా కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. ఈ కారిడార్‌ల కోసం తగిన ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి గుర్తించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## అభివృద్ధి..సంక్షేమాలు ప్రజల్లో తీసుకెళ్లాలి

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకా ంత్

శాంతిపురం, మార్చి 11 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకా ంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత ్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక నందిగ ం కళ్యాణ మండపంలో తెదేపా కుటు ంబ సాధికార సభ్యుల శిక్షణ కార్యక్రమంకు డాక్టర్ శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కుటుంబ సాధికార సభ్యులకు వారి పరిధిలోని కుటుంబాల వివరాల సేకరణకు ప్రత్యేక బుక్కులు రూపొందించడం జరిగిందన్నారు. కెఎస్‌ఎస్‌లు తమ పరిధిలో ఉన్న ప్రజలకు అందుతున్న పథకాలు, వారి సమస్యలు అడిగి తెలుసుకుని నమోదు చేయాలన్నారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు వస్తాయని ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, సత్యేంద్రశేఖర్, మణి, నాగరాజు, బసవరాజు, శేఖర్, బాలు, రాజు, చంద్రకళ, సుగుణమ్మ, అనసూయ పాల్గొన్నారు.

## నేడు కోణాపల్లిలో డ్రోన్ ప్రదర్శన

యాదమరి, మార్చి 11 ప్రభాతవార్త:

యాదమరి మండలం కోణాపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వ్యవసాయ డ్రోన్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి దీపా తెలిపారు. ఈ కార్యక్రమంకు రైతులు హాజరై డ్రోన్ సాంకేతికతను పరిశీలించవచ్చునని, పొలాల్లో ఎరువులు, పురుగుల మందులు వేగంగా, సమానంగా పిచికారి చేయడం, కూలీ ఖర్చులు, సమయంను తగ్గించడానికి ఈ ప్రదర్శన రైతులకు ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు.

## రైల్వేస్టేషన్‌లో నేరాలకు పాల్పడితే చర్యలు

కుప్పం, మార్చి 11 ప్రభాతవార్త



రైల్వేస్టేషన్‌లో ఎవరైనా నేరాలు, చోరీ లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రైల్వే జిఆర్‌పి పోలీసులు హెచ్చరించారు. బుధవారం స్థానిక రైల్వేస్టే షన్‌లో నేరాలు, వాటి పర్యవసనాలపై ప్రయాణీకులకు అవగాహనకల్పించారు. రైళ్లపైరాళ్లువిసరడం, రైల్వే స్టేషన్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు.

## రైల్వే కోడూరులో గంగమ్మ తల్లి పొంగబాలు...

రైల్వేకోడూరు, మార్చి11 ప్రభాతవార్త



రైల్వే కోడూరు పట్టణంలోని ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న శ్రీ బలిజపల్లి గంగమ్మ తల్లి పొంగుబాలు కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు పట్టణంలోని రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు పోలీసుల పర్యవేక్షణను ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు డీఎస్పీకి వివరించారు. అదేవిధంగా డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మతసామరస్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వారి వారి భక్తి కార్యక్రమాలను నిర్వహించుకోవాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా ముస్లింల ప్రత్యేక ఉపవాస కార్యక్రమాలను, గంగమ్మ తల్లి పొంగుబాలను సంబంధిత పోలీసు సిబ్బందితో బందోబస్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు సిఐ చంద్రశేఖర్, ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య సంకీర్తనలకు బాణీలు కట్టిన రాళ్లపల్లి

తిరుమల,మార్చి 11ప్రభాతవార్తప్రతినిధి:



తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించడంలో రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ విశేష కృషి చేశారని పద్మావతి మహిళా డిగ్రీ , పిజి కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ శోభ తెలిపారు. అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో బుధవారం ఉదయం రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 47వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శోభ రాళ్లపల్లి దర్శించిన సారస్వతా లోకం" అనే అంశంపై వివరించారు. రాళ్లపల్లి తమ రచనల ద్వారా తెలుగు సారస్వతాన్ని సమృద్ధిగా చేసి సాహిత్య లోకానికి చిరస్థాయిగా నిలిచే సేవలు అందించారని ఆమె కొనియాడారు. తెలుగు పండితుడు డాక్టర్ మలేపట్టు పురుషోత్తమాచారి, ఎస్వీవిశ్వవిద్యాలయం విశ్రాంత అచార్యులు ఆచార్య దామోదర్ నాయుడు, తెలుగు సాహిత్య విమర్శకు విశేష సేవ చేసిన రాళ్ళపల్లి జీవితం వివరించారు. రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ విగ్రహానికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య రాళ్లపల్లి దీప్త, అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి మేడసాని మోహన్, సంచాలకులు లత పాల్గొన్నారు.

## సాహితీవేత్త అనంతకృష్ణ శర్మకు పుష్పాంజలి

తిరుపతి,మార్చి 11ప్రభాతవార్త:



సాహితీవేత్త ,రచయిత రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ వర్ధంతి సందర్భంగా రాములవారి గుడి దక్షి ణ మాడ వీధిలోని చిగో రా ఆధ్యాత్మిక సేవా కేంద్రం వద్ద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భం గా అనంతకృష్ణ శర్మ గారి రచనలు , అన్నమాచార్య కీర్తనలు స్వర కల్పన చేసి కళాకారులకు అందించిన వైనం గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమ లో బిజెపి నాయకుడుగుండాల గోపీనాథ్ రెడ్డి , బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీనియర్ అసిస్టెంట్ పి ఆర్ ఎల్ కుమార్. ఆఫీస్ అసిస్టెంట్ లీలావతి .క్రెడిట్ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యురాలు భాగవతుల జయలక్ష్మి . బిజెపి నాయకులు రవి ప్రసాద్.లోక ప్రభాకర్ నాయుడు,తులసి రామ్ నాయుడు, తొండమనాటిసుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల పొడవునా మహిళలకు

అగర్వాల్స్ కంటి ఆస్పత్రి ఉచిత కంటి పరీక్షలు

తిరుపతి హెల్త్,మార్చి 11ప్రభాతవార్త:



అవసరమైన ప్రతి మహిళకు కంటి పరీక్ష చేయించాలనే ప్రతిజ్ఞ చేయాలని దేశవ్యాప్తంగా ప్రజలను ప్రోత్సహించే కార్యక్రమం డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆస్పత్రి చేపట్టింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నెల పొడవునా మహిళలకు ప్రత్యేక అవుట్‌పేషెంట్ కన్సల్టేషన్ సౌకర్యంకల్పిస్తున్నారు. దేశంలో 280కి పైగా కంటి ఆస్పత్రులు, విజన్ కేర్ సెంటర్ల ద్వారా సుమారు పది లక్షల మహిళలకు ఉచిత కంటి పరీక్షలు అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ముఖ్యమైన మహిళకు ఉచిత కంటి పరీక్ష చేయించేందుకు ప్రతిజ్ఞ చేయాలని ఆసుపత్రి కోరింది. వెబ్‌సైట్‌లో ఉన్న సులభమైన 30 సెకన్ల ప్రతిజ్ఞ ఫారాన్ని పూరించడం ద్వారా డిజిటల్‌గా పాల్గొనవచ్చని, 9003888444 నంబర్‌కు కాల్ చేసి ఉచిత కంటి పరీక్ష కోసం ఒక మహిళను నామినేట్ చేయవచ్చని తెలిపింది. ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్ పర్యవేక్షణలో కంటి పరీక్షలపై అవగాహనను పెంపొందించడానికి ఈ పథకం నిర్ణయించారు.

## వేసవిలో నిరంతర విద్యుత్తు

తిరుపతి,మార్చి 11ప్రభాతవార్త:

వేసవిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. వేసవి దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ ను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు మెరుగైన, సత్వర సేవలను అందించడం ద్వారా వినియోగదారుల నుంచి మన్ననలు పొందాలని సూచించారు.తిరుపతిలో చీఫ్ ఇంజనీర్ నుండి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్‌ల వరకు హాజరైన అధికారులతో సిఎండి శివశంకర్ వేసవిలో విద్యుత్ సరఫరా, పంపిణీపై సమీ క్షించారు.

## ట్రాఫిక్ నియమాలు



**తిరుపతి,మార్చి 11ప్రభాతవార్త:** విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు పాటించడం, రోడ్డు భద్రత గురించి ట్రాఫిక్ సిఐ సంజీవకుమార్ అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు పోలీసు అధికారులు చేపట్టారు. బుధవారం ఎం.ఆర్. పల్లి లోని ఉన్నతపాఠశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ డిఎస్పీ పి.రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ ఎ. సంజీవ కుమార్

## నిరాశ్రయుల వసతి గృహంలో ఉచితవైద్యశిబిరం



చిత్తూరురూరల్,మార్చి 11 ప్రభాతవార్త: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్ర యుల వసతిగృహంలో ఆర్‌విఎస్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటుచేసారు. నిరాశ్రయుల ఆరోగ్యం కోసం వైద్యశిబిరాలు నిర్వహిస్తూ వారికి అవసమైన మందులతో పాటు వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం హాస్పిటల్ సిబ్బంది నిరాశ్రయులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేసి వారికి తగు జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విఎస్ హాస్పిటల్ డాక్టర్లు రాధ, జస్వంత్, ఉషశ్రీ, పిఆర్ఓ ప్రతాప్‌కుమార్, స్టాఫ్‌నర్సులు మౌనిక, దీపశ్రీ, లయలతో పాటు వసతి గృహ సిబ్బంది ప్రమీల, శ్రీనివాస్, శ్రీజ, సుందర్‌రాజ్ ఇంద్రాణి,రఘుపతి, నిరాశ్రయులు పాల్గొన్నారు

## బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి

నెరబైలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమంత్



యర్రావారిపాలెం, మార్చి 11, ప్రభాతవార్త: మహిళల్లో పెరుగుతున్న గర్భా శయ ముఖ క్యాన్సర్‌ను నివా రించేందుకు 14-15 సంవత్స రాల మధ్య వయస్సు గల బాలి కలు తప్పనిసరిగా హెచ్ పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని నెరబైలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుమంత్ సూచించారు. యర్రావారిపాలెం మండలం, నెరబైలు పీహెచ్‌సీ లో బుధవారం డాక్టర్ సుమంత్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ మహిళలు అధిక సంఖ్యలో గర్భాశయ ముఖ క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని క్యాన్సర్ వలన జరిగే మరణాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాయని చెప్పారు. చిన్న వయస్సులోనే ఈ టీకా తీసుకుంటే భవిష్యత్తులో గర్భాశయ ముఖ క్యాన్సర్ ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. అందువలన 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికల తల్లిదండ్రులు ముందుకు వచ్చి తమ పిల్లలకు ఈ టీకా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ్, నెరబైలు పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వాక్సిన్‌తోనే బాలికల ఆరోగ్య రక్షణ

పులిచెర్ల, మార్చి 11, ప్రభాతవార్త



మండలంలోని యెల్లంకివారి పల్లిలో ఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో బాలికల ఆరోగ్య రక్షణ కోసం హెచ్‌పివి వ్యా క్సిన్ వేసారు. ఈ వ్యాక్సిన్ ప్రధానంగా మహిళల్లో కనిపించే సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖ క్యాన్సర్)ను నివారించడానికి ఉపయోగపడుతుందని ఎంపిహెచ్‌ఈఓ జి. రామచంద్రయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు ఈ టీకా ఇవ్వడం చాలా ముఖ్యమైనదన్నారు. బుధవారం బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ సింగిల్ డోస్ (ఒకే డోస్) ఇవ్వబడింది. ఈ వ్యాక్సిన్ వల్ల హెచ్‌పివి వైరస్ ఇన్ఫెక్షన్ తగ్గి భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందన్నారు. ఇంజెక్షన్ ఇచ్చిన చోట తేలికపాటి నొప్పి లేదా స్వల్ప జ్వరం వంటి చిన్నపాటి సైడ్ ఎఫెక్ట్స్ కనిపించవచ్చు, అయితే అవి తాత్కాలికంగా మాత్రమే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు డా. పి. యల్లయ్య, హెడ్ మాస్టర్ ఎం. హరి శంకర్, ఏఎన్ఎంలు, ఇతర హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇ- సైకిళ్లు పర్యావరణ హితం కలిగినవి

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 11 ప్రభాతవార్త



ఇ – సైకిళ్లు పర్యావరణ హితం కలిగినవని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం శ్రీ ప్రియ నర్సింగ్‌హోం అధినేత, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ తమ ఆస్పత్రి ఉద్యోగులకు వ ంద ఇ – సైకిళ్లను అందించే కార్యక్రమంను ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు కుప్పంలో పర్యా వరణ కాలుష్య నియంత్రణకు ఇ – సైకిల్ ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఇటీవలే 5555 ఇ – సైకిళ్లను సిఎం సమక్షంలో పంపిణీ చేపట్టి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినట్లు తెలిపారు. తమ ఆస్పత్రి సిబ్బందికి ఇ – సైకిళ్లు అందించి ప్రోత్సహించిన శ్రీ ప్రియ నర్సింగ్‌హోం అధినేత డాక్టర్ సుధీర్‌ను అభినందించారు. డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ఇంత గొప్పఅవకాశం ఇచ్చిన సిఎం చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, కౌన్సిలర్ సోమశేఖర్, డాక్టర్ ప్రశాంత్ గౌడ, మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, షాదీఖానా ఛైర్మన్ సర్దార్, మాజీ ఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, తెలుగుయువత అధ్యక్షుడు ప్రశాంత్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం శ్రీప్రియ నర్సింగ్‌హోం అధినేత డాక్టర్ సుధీర్, నేతలు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

## జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌కు కెడిసి విద్యార్థినులు

కుప్పం, మార్చి 11 ప్రభాతవార్త



జాతీయ స్థాయి మెరిట్ స్కాలర్‌షిప్‌కు కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు ఎంపికైనట్లు కాలేజ్ వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్ తెలిపారు.సెకండియర్ (బిఎ ఎ) చదువుతున్న అమీన్ తాజ్, బిబిఎ చదువుతు న్న సింధు అనే విద్యార్థి నులు ఎబిసిటిఇ సరస్వతి మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్‌సుధారాణి,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పెనగలూరు, మార్చి 11 ప్రభాతవార్త



రైల్వేకోడూరు నియోజకవర్గం పెగలూరు మండలం స్థానిక కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలలో 2026 27వ సంవత్సరమునకు గాను 6వ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం చేరగోరే విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పెనగాలూరు కె. జి. బి. వి. ప్రిన్సిపాల్ కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు వెబ్సైట్ నందు అందుబాటులో ఉంటుందని తెలిపారు ఈ మేరకు పెనగలూర్ కేజీబీవీ ప్రిన్సిపాల్ .సుచరిత ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కేజీబీవీ పెనగలూరు నందు 7, 8, 9, 10 వ తరగతి ఇంటర్ రెండవ సంవత్సరం ప్రస్తుతం ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి కూడా ఏప్రిల్ 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## కడ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం : కడ పి.డి

కుప్పం, మార్చి 11 ప్రభాతవార్త



కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ), నేషనల్ స్కిల్ డెవల ప్‌మెంట్ కార్పోరేషన్‌ల సంయుక్త అధ్వర్యంలో యువతీ యువకులకు 73రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందే వారికి కుప్పం ప్రాంతంలో ఏర్పాటయ్యే ఇరవై కంపెనీల్లో ఉద్యోగా లకు కావాల్సిన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విజయ వంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వందశాతం ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18-43ఏళ్ల వయసుగల వారు ఈ శిక్షణకు హాజరు కావచ్చన్నారు. సోలార్ డొమెస్టిక్ ప్రాడక్ట్ అసెంబ్లర్, క్లౌడ్ అప్లికేషన్ డెవలపర్, వెబ్, డెవలపర్, ఇంటిగ్రేటెడ్ ఫారి మ్మింగ్ ప్రాక్టీషనర్,ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ అసెంబ్లీ ఆపరేటర్ విభాగాల్లో శిక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు కడ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసిన ఎంపిపి

గుడిపాల, మార్చి 11 ప్రభాతవార్త:



మండల పరిధిలోని చిత్తపార అంగ న్‌వాడీ కేంద్రంను బుధవారం ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రం పని తీరు, నిర్వహణ విధానం, పిల్లలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించిన ఎంపిపి మధ్యాహ్నం భోజనం, పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా చేస్తున్నారా! లేదా! అని అక్కడి సిబ్బందిని ప్రశ్నించారు. చిన్నారులకు అందిస్తున్న బాలామృతం, గ్రుడ్లు, ప్రభుత్వం అందిస్తున్న పోషకాలు అందుతున్నాయా! లేదా! అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సెల్‌ఫోన్లలో గర్భిణి స్త్రీలతో మాట్లాడి పౌష్టికాహారం సక్రమంగా ఇస్తున్నారా! లేదా! అని అరా తీశారు. పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ఎక్కడ నిర్లక్ష్యం చేయవద్దని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందగౌడ్, నాయకులు చందు, నిత్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## స్వర్ణ గ్రామంసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

శాంతిపురం, మార్చి 11 ప్రభాతవార్త



మండలంలోని సచివాలయ (స్వం ర్ణగ్రామం) సిబ్బంది కార్యాలయ పనివేళ లలో ఖచ్చితముగా అందుబాటులో వుండి ప్రజలకు వివిధ రకాల సర్వీసులను అందించాలని ఎమ్ పీడీ ఓ కుమార్ ఆదేశించారు. మండలము లోని అనికెర, మఠం సచివాలయ ములను (స్వర్ణగ్రామం) అకస్మికముగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ(స్వర్ణగ్రామం) సిబ్బంది పనివేళలో అందుబాటులో లేక పోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది సిబ్బంది వివిధ కారణాలతో గైర్హాజరు అవుతున్నారని అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్వర్ణగ్రామంసిబ్బంది పేరు మరియు ఫోన్ నెంబర్లు సచివాలయము బయట నోటీసు బోర్డులో వుంచుతామని తెలిపారు. ప్రజలు దీనిని గమనించి సంభందిత సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. బుధవరం సుమారు 16 మంది గైర్హాజరయ్యారని వీరికిషోకాజునోటీసులుజారీచేశామని,సరైనకారణములేనిచో తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 14 సంవత్సరాల ఆడపిల్లలకు హెచ్.పి.వి. వ్యాక్సిన్ తప్పనిసరి

బైరెడ్డిపల్లి మార్చి 11 ప్రభాతవార్త



తీర్ధం పిహెచ్‌సిలో డాక్టర్. అరుణ్ కుమార్, డాక్టర్. పద్మావతి మేడం ఆధ్వర్యంలో (హ్యూ మన్ పాపిలో మావైరస్. హెచ్.పి. వి . వ్యాక్సిన్) 14 సంల వయస్సు గల ఆడపిల్లకి వేయడం జరిగింది. ఈవాక్సిన్ 99 శాతం గర్భాశయ క్యాన్సర్ రాకుండా నివారిస్తుంది. అందుకే అందరూ తప్పకుండా వేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఆశాడే కార్యక్రమము జరుపబడినది. ఈనెలలో ఉన్నా ఆశా ఇండికేటర్స్ గురించి తెలియచేయడం జరిగింది. ఈకార్యక్రమంలో కాంతమ్మ, పి.హెచ్.ఎన్.శమంతక, హెచ్. ఎస్.తిరుమలమ్మ ఆశాలు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణి

శాంతిపురం, మార్చి11 ప్రభాతవార్త



నలుగురికి అనారోగ్యం బారిన పడ్డ నాలు గురికి మం జూరైన సిఎమ్ఆర్ ఎఫ్ చెక్కులను ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పం పిణి చేసారు. ఎమ్మెల్సీ కం చర్ల శ్రీకాంత్ చీమనపల్లి భాగ్యమ్మకు 2 లక్షలు, ఎంకే పురం మాధవ్‌కు రూ. 387123, శివకురుబురు చిన్ని కృష్ కురూ.809126,ఇస్మాయిల్ అబకలదొడ్డికు 42 వేలు అందిచారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడుఉదయ్‌కుమార్‌నాయుడు, విశ్వనాథ నాయుడు, లోకి, మనీ, బసవరాజు ,నాగరాజు, కేశవులు, చంద్ర, సింగిరి శ్రీనివాసులు, బాలమురుగన్, రుద్రప్ప, చంద్రకళ, సుగుణమ్మ ,అనసూయ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని చెక్బందీ చేసిన రెవిన్యూ అధికారులు

బైరెడ్డిపల్లి మార్చి 11 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండలం దొంతిరాళ్లపల్లి గ్రామానికి చెందిన భూమికి చెక్బంది చేసి బోర్డును నాటిన రెవెన్యూ అధికారులు.ఈ గ్రామానికి చెందిన 11 ఎకరాల 33 సెంట్లు, ఇంకో సర్వేనెంబర్‌కు గాను 67 సెంట్లు భూమిని సర్వే చేసి, ప్రభుత్వ భూమిగా గుర్తించి, ఆభూమిని ఎవరు ఆక్రమించరాదని, ఆక్రమించినట్లయితే శిక్షార్హులని బోర్డు వేయడం జరిగినది. ఈ క్రమంలో మండల తహసిల్దార్ ఎమ్మెస్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించడం జరిగిందని.ఎవరు కూడా వాటి జోలికి వెళ్ళకూడదని,వెళ్లినచో తమకు ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు ఆర్ఐ దామోదరచారి, వీఆర్వో జై రామ్,తోటి తలారిలు పాల్గొన్నారు.

## మున్సిపల్ పాలకవర్గ చివరి సమావేశం

పలమనేరు, మార్చి 11 ప్రభాతవార్త:

మున్సిపాల్టీలకు, కార్పొరేషన్లకు పదవీ కాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా పలమనేరు మునిస్పాల్టీ పాల కవర్గం పదవీ కాలం ఈ నెల 17తో ముగుస్తోంది. 18 నుండి ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వస్తుంది. దీంతో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం చివరి సమావేశం ఏర్పాటు చేశారు. ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైస్ ఛైర్మన్లు గుల్జార్, రవి, మున్సిపల్ కమీషనర్ కెవి రమణారెడ్డి, మొత్తం 24 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు, ఇందులో 18 మంది వైసిపి కౌన్సిలర్లు, 6 మంది తెలుగుదేశం కౌన్సిలర్లు ఉన్నారు. చివరి సమావేశం కావడంతో మున్సిపాల్టీలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు ఏక గ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పార్టీలు వేరైనా ఎలాంటి విభేధాలు లేకుండా కౌన్సిలర్లు అభివృద్ధి పనులకు సహకరించారని పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి మాట్లాడుతూ తన పదవీ కాలంలో సహకరించిన కౌన్సిలర్లు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు కూడా తమ వంతు వార్డుల అభివృద్ధికి ఎంతో కృషి చేశామని మిగిలిన పనులు కూడా అధికారుల దృష్టికి తెచ్చి పూర్తి చేస్తామని తెలిపారు.

## గ్యాస్ ధరలు పెంపుపై సిపిఎం ధర్నా

పలమనేరు, మార్చి 11, ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెం చినందుకు నిరసనగా పలమ నేరులో సిపిఎం కార్యాలయం ఎదుట ఆ యూనియన్ నాయ కులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గిరిధర్ మాట్లాడుతూ ఇరాన్– ఇజ్రాయిల్ యుద్ధం సాకుగా చూపి కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు విపరీ తంగా పెంచిందని ఆరోపిం చారు.. గృహస్తులు వంటలకు వాడే డొమాస్టిక్ సిలెండర్‌కు రూ.60 వంతున, కమర్షియల్ సిలెండర్‌కు రూ.110 వంతున పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేద బలహీన వర్గాలను ఈ విధంగా నిలువుదోపిడీ చేయడం దారుణమన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని లేదంటే వామపక్షాల ఆధ్వర్యం లోదేశవ్యాప్తంగాఆందోళనఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలువురు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## భారతదేశం సంస్కృతి, సాంప్రదాయాలకు పుట్టినిల్లు

చిత్తూరురూరల్, మార్చి 11 ప్రభాతవార్త:



భారతదేశం సంస్కృతి, సాంప్ర దాయ విలువలకు పుట్టినిల్లు అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. బుధవారం గిరింపేటలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ విద్యా వికాస సమితి, నైతికశిక్ష విభాగం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రామాయణం అంశంపై నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరచిన వివిధ పాఠశాల విద్యార్థులకు సర్టిఫికేట్స్ ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారిహేమలత, విహెచ్పీ, భాజపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛకుప్పం సాధనకు సహకరించాలి : కమీషనర్

కుప్పం, మార్చి 11 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మే రకు కుప్పాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీయే చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రజ్ఞ స్కూల్‌లో విద్యార్థులకు తడి,పొడి, ప్రమాదకరమైన చెత్తలపై అవగా హన కల్పించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ మున్సిపాలిటీ ద్వారా ప్రజలకు చెత్త సేకరణకై ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఇళ్లల్లో పోగయ్యే చెత్తను మూడు రకాలుగా విభజించి ఆ చెత్తను ప్రతి రోజూ ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ కార్మికులకు అందించాలని కోరారు. ఈ చెత్తను మరలా డంపింగ్‌యార్డుకు తరలించి అక్కడ వేరుచేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రోజుకు రెండుసార్లు పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా చెత్తను రోడ్లపై పడేయకుండా సహకరించాలని కోరారు. విద్యార్థులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## రెస్కోలో వన్ టైం సెటిల్మెంట్ సద్వినియోగం చేసుకోండి

రామకుప్పం,మార్చి 11: ప్రభాతవార్త

గ్రామీణ విద్యుత్ సహకార సంఘం మండల రెస్కో పరిధిలో పాత బకాయిలు ఉన్న లబ్ధిదారులకు వన్ టైం సెటిల్మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 31, 2026 వరకు ఉన్న విద్యుత్ బకాయిలను వినియోగదారులకు బకాయిలు మొత్తం చెల్లిస్తే వాటిపై ఉన్న సర్ చార్జ్ వడ్డీ మాఫీ చేస్తామన్నారు. ఈనెల 25 వ తేదీ వరకు వన్ టైం సెటిల్మెంట్ పథకంను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వినగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వండర్ బుక్ సౌత్ ఇండియా కోఆర్డినేటర్‌గా అశ్విని



***తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.*** తిరుపతికి చెందిన సంగరాజు అశ్విని ప్రముఖ అంతర్జాతీయ సంస్థ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు ఆమెకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. అశ్విని విద్యార్హతలు, అనుభవం మరియు నైపుణ్యాలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు సంస్థ తెలిపింది. ఆమె ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో విధులు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలో బాధ్యతలు చేపట్టడం పట్ల అశ్విని సంతోషం వ్యక్తం చేశారు. ఆమె నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.

## తిరుపతిలో జిల్లా స్థాయి శిక్షణ ప్రారంభం

**తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.**



తిరుపతి జిల్లాలో విద్యా నాణ్యతను మెరుగుపరచే లక్ష్యంతో పరేఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ-2024 హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్ అమలుపై రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం బుధవారం తిరుపతిలోని ఎడిపై స్కూల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస స్థాయిని సమగ్రంగా అంచనా వేయడంలో పరేఖ్ సర్వేక్షణ కీలకమని పేర్కొన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్రావు మాట్లాడుతూ హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్ ద్వారా విద్యార్థుల విద్యా పురోగతితో పాటు వారి వ్యక్తిత్వ వికాసాన్ని కూడా అంచనా వేయవచ్చని తెలిపారు. ఈ రెండు రోజుల శిక్షణలో జిల్లాలోని వివిధ మండలాల విద్యాధికారులు, రిసోర్స్ పర్సన్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. కార్యక్రమాన్ని జిల్లా పాఠశాల విద్యాశాఖ , సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

## క్షేత్రస్థాయిలో బీజేపీ పార్టీ బలోపేతం

**పాకాల, మార్చి 11, ప్రభాతవార్త**



పాకాల మండల భారతీయ జనతా పార్టీ బుధవారం సర్వసాధారణ సమావేశం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి గుడి ఆరు బయట నిర్వహించారు. ఇందులో పార్టీ పరంగా ప్రస్తుతం ఆచరిస్తున్న విధి విధానాలు, కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన ఇరువురి పార్టీల సహాయ సహకారాలు, ఇతరత్రా పార్టీ కార్యకలాపాలు, పార్టీ కార్యాచరణ ప్రణాళికల గురించి, పార్టీ సభ్యత్వ నమోదు గురించి, త్వరలో పాకాల మండలంలో జరగబోవు సర్వసభ్య సమావేశం ఏర్పాట్లు, తదితర విషయాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమం నందు బి జె పి చిత్తూరు జిల్లా ముఖ్య కార్యదర్శి వరప్రసాద్, బిజెపి తిరుపతి జిల్లా ముఖ్య కార్యదర్శి కె. నరేష్ బాబు, బిజెపి పాకాల మండల అధ్యక్షులు జయచంద్ర, బిజెపి మండల బిసి నాయకులు నరేంద్ర ఆచారి, నాగరాజ యాదవ్ తదితరులు, సీనియర్ బిజెపి మండల, జిల్లా స్థాయి నాయకులు కలిసి పాల్గొన్నారు.

## మెకానిక్ సిబ్బందికి సాంకేతిక శిక్షణ

**తిరుపతి రవాణ, మార్చి 11 ప్రభాత వార్త**



తిరుపతి జిల్లాలో అశోక్ లేలాండ్ వాహనాల పనితీరు మెరుగుదలపై మెకానిక్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీపీటీఓ మార్గదర్శకత్వంలో, తిరుపతి డిప్యూటీ సీఎంఈ బాలాజీ ఆధ్వర్యంలో జెడ్ ఎఫ్ కమర్షియల్ (వాబ్కో) సాంకేతిక నిపుణుడు సుమన్ ఈ శిక్షణను అందించారు. ప్రత్యేకంగా బ్రేక్ వ్యవస్థ పనితీరు, నిర్వహణ విధానాలపై అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లాలోని 10 డిపోల నుంచి సాంకేతికమరమ్మత్తులసిబ్బంది, పర్యవేక్షణ సహాయకులు పాల్గొని నూతన సాంకేతిక అంశాలు తెలుసు కున్నారు.

## కన్నలి పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య కుల వివాద చిచ్చు

### పోలీసుల్ని ఆశ్రయించిన మహిళా ఉపాధ్యాయురాలు

**తొట్టంబేడు, మార్చి 11 ప్రభాతవార్త**



తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య కుల పోరు చోటు చేసుకుంది. ఈ పంచాయతి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరింది. ఈ మేరకు మహిళా ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేసారు. ఈ పిర్యాదుపై సిఐ నాగరాజు, ఎస్ఐ బాలకృష్ణలు విచారిస్తు న్నారు. అయితే మహిళా ఉపాధ్యాయురాలి కుమారుడు పాఠశాలలో వెళ్ళి హల్‌చల్ చేసినట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. కన్నలి పాఠశాలలో ముగ్గురు టీచర్లు పని చేస్తున్నారు. వీరిలో ఇద్దరు మగవారు. ఒక మహిళా టీచర్ ఉన్నారు. మగ టీచర్లు ఓ కులానికి చెందిన వారుకాగా మహిళా టీచర్ మరో కులానికి చెందిన ఆమె. వీరి మధ్య వివాదాలు సుమారు ఐదునెలల నుంచి సాగుతున్నట్లు సమాచారం. మగ టీచర్లు మహిళా టీచర్‌ను తమ ముందు రాకూడదని, అలాగే టీచర్స్ రూంలో రాకూడదంటూ ఆంక్షలు విధించటంతో ఆమె మానసికంగా కృంగి పోయింది. అయితే వారి వేధింపులు శృతి మించటంతో ఆమె ఇంట్లో బాధ పడుతుండగా కుమార్తె చూసి తన సొదరునికి విన్నవించింది. ఆతను కోపోద్రిక్తుడై పాఠశాలకు వెళ్ళి ఆగ్రకుల ఉపాధ్యాయులను హెచ్చరించినట్లుసమాచారం. అంతేకాకటూటౌన్ పోలీసు స్టేషన్లో ఎస్‌సి ఎస్‌టి వేధింపులంటూ ఫిర్యాదు చేసారు.

## గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి



**సత్యవేడు, మార్చి 11 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం పేరడం, మదనంబేడు, అంబాకం గ్రామాల్లోని దళితులు, గిరిజనులు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని భూమి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, సత్యవేడు మండలం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ధర్నా కార్యక్రమం జరిగిందని మెలుగు రమేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ పాల్గొని మాట్లాడుతూ కూలినాలీ చేసుకుని బతికే వీళ్ళకు భూములు ఎందుకు అనే విధంగా భూముల నుంచి వెళ్ళగొట్టడానికి రెవెన్యూ అధికారులు అనుభవంలో ఉన్న వారికి పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. మదనంబేడులోని 25 ఏళ్ళకు పైగా నివాసం ఉన్న సెల్వి మునస్వామి దళిత కుటుంబంకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, ఇంటి స్థలాలు లేని గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, పేరడం గ్రామంలోని ప్రభుత్వ భూములు నివాసం ఉన్న గిరిజనులకు దళితులకు ఇంటి పట్టాలు, సాగు భూమి పట్టాలు ఇవ్వాలని, అంబాకం దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, పై డిమాండ్లు డీటీ త్యాగరాజుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మునస్వామి, కిష్టయ్య, తిరుమలైరెడ్డి, యాలయ్య, లూరుద్, అర్చన విష్ణు, కేశవులు, కోలాపురి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అతివేగంతో వెళ్లి ప్రమాదాలకు గురి కాకండి - డీఎస్పీ

***నాగలాపురం, మార్చి 11 ప్రభాతవార్త:*** మండలం కేంద్రంలోని టీఆర్ఆర్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన క్రైమ్ మీటింగ్‌లో పుత్తూరు డివిజన్ డీఎస్పీ రవికుమార్, డివిజన్ సీఐలు, 8 మంది ఎస్ఐలు పాల్గొన్నారు. ప్రతి నెల రెండో వారం లో జరిగిన కేసుల యొక్క పురోగతిని పరిశీలించడం జరుగుతుందని డీఎస్పీ రవికుమార్ తెలిపారు. సమావేశంలో సత్యవేడు సీఐ మురళీనాయుడు, నాగలాపురం ఎస్ఐ సునీల్, సత్యవేడు ఎస్ఐ, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## గర్భాశయ ముఖ క్యాన్సర్‌పై అవగాహన

**విజయపురం, మార్చి 11 ప్రభాతవార్త:**



14 సంవత్సరాల లోపు విద్యార్థినులకు గర్భాశయ ముఖ క్యాన్సర్‌పై వైద్యాధికారిణి విష్ణుప్రియ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 14 సంవత్సరాల లోపు బాలికలు 272 మందిని గుర్తించామని, వారిలో 130మందికి హెచ్‌పీవీ టీకాను విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందించామన్నారు. క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇళ్ళత్తూరు-కనకమ్మసత్రం రోడ్డు నుంచి జంబాడ రోడ్డుకు భూమిపూజ

***విజయపురం, మార్చి 11 ప్రభాతవార్త:*** మండలంలోని ఇళ్ళత్తూరు-కనకమ్మసత్రం రోడ్డు జంబాడకు వెళ్లే రోడ్డుకు బుధవారం ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు, ఎంపీపీ లక్ష్మీపతిరాజు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత క్రమంగా హామీలను నెరవేరుస్తున్నదని నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కృషితో గ్రామీణ రోడ్లకు మోక్షం లభించిందన్నారు. అనంతరంలో మండలంలోని శ్రీహరిపురం, గాండ్ల కండ్రిగ, చెంగమనాయుడు కండ్రిగ, కోసలనగరంలో జరుగుతున్న రోడ్డు పనులను, ఇళ్ళత్తూరు పాఠశాల ప్రహరీ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, ముని భాస్కర్‌రాజు, దశరథరాజు, చంద్రశేఖర్‌రాజు, రవిరాజు, సమరసింహారెడ్డి, శేఖర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## *గ్రానైట్ లారీ సీజ్*

*చిన్నగొట్టిగల్లు, మార్చి 11 ప్రభాతవార్త*

*తిరుపతి మదనపల్లి జాతీయ రహదారి మార్గంలో వెళ్తున్న రెండు గ్రానైట్ లారీలను మోటార్ వాహనంల ఇన్స్పెక్టర్ స్వర్ణలత సీజ్ చేశారు మదనపల్లి వైపు నుండి కృష్ణపట్నం పోర్టుకు పరిమితికి మించి గ్రానైట్ తో వెళుతుండగా తనిఖీలు నిర్వహించి సీజ్ చేసి బాకరాపేట పోలీసులకు అప్పగించారు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగించి అధిక లోడుతో వెళుతున్న లారీలకు జరిమానా విధించి సీజ్ చేసినట్లు తెలిపారు.*

## భాష్యం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.**



స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు న్యూ బాలాజీ కాలనీలోని భాష్యం బృహస్పతి క్యాంపస్‌లో జోనల్ ఇంచార్జి ఎల్. లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ రేడియో డయాగ్నోసిస్ విభాగానికి చెందిన డా. శ్రీ అలేఖ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. అలేఖ్య మాట్లాడుతూ విద్య ఎంతో గొప్పదని, భాష్యం పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలు తనను ఈ స్థాయికి తీసుకు వచ్చాయని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గురువులను గౌరవించాలని, మార్పుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం యుకేజీ మరియు 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్ఈఓ బిందుమాధవి, ప్రధానోపాధ్యాయులు నేతాజీ, హెచ్ఎం మణిలాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యం బలోపేతంపై అవగాహన



***తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.*** ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో మైండ్ మ్యాటర్స్ ఎమోషనల్ స్కిల్స్ ద్వారా మానసిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడం అనే అంశంపై ఒక రోజు సింపోజియం కార్యక్రమానికి బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి , ఎస్వీయూ ప్రొఫెసర్లు బీఎస్ కుమార్ రెడ్డి , ఎల్కే రెడ్డి, చిత్తూరు అపోలో వర్సిటీ ప్రొఫెసర్ ఎస్ హాసీనా ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు జ్ఞాన సముపార్జన, మానసిక ఆరోగ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు సూచనలు, భావోద్వేగాల నిర్వహణ, భవిష్యత్తు ప్రణాళిక వంటి అంశాలపై సుదీర్ఘ ప్రసంగాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఉమారాణి, అధ్యాపకులు డాక్టర్ సుధారాణి, డాక్టర్ భీమన్న, డాక్టర్ మల్లి కార్జునరావు, డాక్టర్ కిషన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## నర్సింగ్ సంస్థల సమస్యలపై సమావేశం



***తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.*** ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతిలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి, చిత్తూరు, అనంతపూర్, కడప, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా ఇన్‌చార్జ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింగ్ కాలేజీలు, స్కూల్స్‌కు సంబంధించిన క్లినికల్ అఫిలియేషన్, స్కాలర్‌షిప్స్ తదితర ముఖ్యమైన సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు చెన్నా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు, ఉపాధ్యక్షులు ప్రసాద్ రావు, తిరుపతిజిల్లాఅధ్యక్షులువై. ప్రవీణ్, కార్యదర్శి రాకేష్ కిరణ్, కోశాధికారి విజయభాస్కర్ పాల్గొన్నారు.

## మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో బ్రైడల్ జ్యువెలరీ షో ప్రారంభం



***తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.*** ఈ ప్రదర్శన మార్చి 5 నుంచి మార్చి 17 వరకు కొనసాగుతుంది అని, వివాహ వేడుకలను దృష్టిలో పెట్టుకుని దేశంలోని భిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నవ వధువుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాల సేకరణలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఆధునిక వధువుల అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన పలు ఆకర్షణీయమైన నగలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా భారతీయ వారసత్వ ఆభరణాల బ్రాండ్ డివైన్, వజ్రాభరణాల బ్రాండ్ మైన్, అన్‌కట్ వజ్రాభరణాల బ్రాండ్ ఎరా వంటి ప్రత్యేక కలెక్షన్లు కూడా ప్రదర్శిస్తున్నారు. ఈ బ్రైడల్ జ్యువెలరీ షో సందర్భంగా బంగారం, రత్నాభరణాలు, అన్‌కట్ ఆభరణాల తరుగు చార్జీలపై 40 శాతం వరకు, వజ్రాభరణాల వజ్రాల విలువపై 30 శాతం వరకు ప్రత్యేక తగ్గింపులు అందిస్తున్నారు. ఈ ఆఫర్లు మార్చి 22, 2026 వరకు మాత్రమే వర్తిస్తాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే "వన్ ఇండియా వన్ గోల్డ్ రేట్" ప్రచారం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మలబార్ షోరూముల్లో ఒకే ధరలో బంగారం అందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

## మాంస ఉత్పత్తుల తయారీ మార్కెటింగ్‌పై రైతులకు శిక్షణ



***తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.*** శ్రీ వెంక టేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయానికి చెందిన వెట ర్నరీ సైన్స్ కళాశాల పశుసంపద ఉత్పత్తుల సాంకేతిక విభాగంలో "విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీ , మార్కెటింగ్ ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం" అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ముగింపు సమావేశానికి ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డా. బి. శోభామణి ముఖ్య అతిథిగా హాజరై, రైతులు , గ్రామీణ యువత విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీ ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమానికి వెటర్నరీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డా. పి. జగపతిరామయ్య అధ్యక్షత వహించగా, పశుసంపద ఉత్పత్తుల సాంకేతిక విభాగాధిపతి డా. జి. విజయ భాస్కర్ రెడ్డి మార్గదర్శకత్వంలో శిక్షణ నిర్వహించారు. శిక్షణలో మాంస ప్రాసెసింగ్ పద్ధతులు, ఆహార భద్రత, ప్యాకేజింగ్, లేబులింగ్ , మార్కెటింగ్ అంశాలపై శిక్షణ అందించారు. ముగింపు సందర్భంగా శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. కె. సుధీర్, డా. జెడ్. నవీన్, డా. వై. రవీంద్ర రెడ్డి, డా. బి. రాంబాబు నాయక్, డా. బి. రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**పుత్తూరు రూరల్, మార్చి 11 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణంలో రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు ఎంతో నిష్టతో చేస్తున్న ఉపవాస దీక్షల్లో తమ వంతుగా రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు రాస్ మహిళా క్రాంతి ప్రాజెక్టు ఆఫీసర్ జి.వెంకటేశ్వరులు క్షేత్ర స్థాయి అధికారి వేదాచలం, పి.బాలకృష్ణ, ముని రత్నమ్మ, ఇతర సిబ్బంది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గేటు పుత్తూరు మసీద్ ఏ ముఖ ద్దస్‌కమిటీప్రెసిడెంట్‌మహ్మద్‌గౌస్, ఎస్.కె.షబ్బర్, రసూలుల్లా హమీద్ బాషాలు పాల్గొన్నారు.

## కళ్ళు లేని జీవితం అంధకారం

**రేణిగుంట, మార్చి 11 ప్రభాతవార్త**



కళ్ళులేని జీవితం అంధకారం అని సిఆర్ ఎస్.డి.ఎం. ఓ డాక్టర్ హిమజ భాయి అన్నారు. రేణిగుంట సి ఆర్ యస్ నందు తిరుపతికి చెందిన ప్రముఖ కంటి వైద్య ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం సిఆర్ ఎస్ ఉద్యోగులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రముఖ ఆప్తమాలజిస్ట్ సమక్షంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికులు కంటి చూపు పట్ల శ్రద్ధ వహించాలని కంటి వైద్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమజా భాయ్ మాట్లాడుతూ కళ్ళు కనిపించని జీవితాలను ఊహించుకోలేమన్నారు. రకరకాల కంటి వ్యాధులు సంక్రమించి కంటి చూపు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు 6 నెలలకు లేదా సంవత్సరానికి ఒకసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రైల్వే ఆసుపత్రిలో ప్రతి గురువారం కంటికి సంబంధించిన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్యంగా ఏ విటమిన్ కు పుష్కలంగా ఉన్న ఆకుకూరలు, క్యారెట్ భుజించాలన్నారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కావ్య, డబ్ల్యూపిఓ శ్రీనివాస్ నాయక్, సి ఆర్ ఎస్ ఆసుపత్రి సిబ్బంది హేమలత, హెల్త్‌ఇన్స్పెక్టర్‌ఎంరాజ్‌మీనా, ధర్మ, సుజాత, అంబికా తదితరులు పాల్గొన్నారు....

## నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు నడిపితే చర్యలు తప్పవు



***రేణిగుంట మార్చి 11 ప్రభాత వార్త*** నిబంధ నలకు విరుద్ధ ంగా ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని డిఎంహెచ్వో బాలకృష్ణ నాయక్ హెచ్చరించారు. రేణిగుంట పట్టణంలోని పలు ఆసుపత్రులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రులు నిర్వహిస్తున్న వైద్యుల ఎంబిబిఎస్ సర్టిఫికెట్లు, ప్రభుత్వం ఇచ్చిన రిజిస్ట్రేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రేణిగుంట పట్టణంలో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు రావడంతో తనిఖీకి వచ్చామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రిలో నడిపితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రేణిగుంట పట్టణంలో మొత్తం ఐదు ఆసుపత్రులను పరిశీలించామని అందులో కొన్ని ఆసుపత్రులకు సరైన రిజిస్ట్రేషన్లు లేనట్లు గుర్తించామని తెలిపారు. నిబంధ నలను పాటించని పాటించని ఆసుపత్రులకు షోకాస్ నోటీసులు జారీ చేస్తామన్నారు. డి ఎం హెచ్ ఓ తో పాటు డి పి ఎం ఓ డాక్టర్ ఛాత్ర ప్రకాష్ రెడ్డి ఉన్నారు..

# తిరుపతి డివిజన్

## తిరుపతిరూరల్‌లో వెలుగు సంఘమిత్రల సమీక్షా సమావేశం

**తిరుపతిరూరల్, మార్చి10 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలం వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించి, ప్రాజెక్టు కార్యకలాపాల పురోగతిని సమీక్షించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1051 మహిళా సంఘాలకు రూ.170.90 కోట్ల బ్యాంకు లింకేజ్ సాధించి, తిరుపతిరూరల్ మండలం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. స్త్రీ నిధి, సిఐఎఫ్ ఋణాల వసూళ్ళను రికవరీ యాప్ ద్వారా డిజిటల్ లావాదేవీల రూపంలో నిర్వహించాలని సూచించారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్యాకేజింగ్‌పై శిక్షణలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే పిఎంఎఫ్ఎంఇ, పిఎంఇజిపి, పిఎం విశ్వకర్మ, ముద్ర ఋణాలపై గ్రామ సంఘాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్వాసులనాయుడు, స్త్రీనిధి హేమంత్‌కుమార్, సిసిలు రమేష్, ధనంజయ, రవి, చిత్ర, సుజాత, గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### రాజముద్రతో 218 మందికి పాస్‌బుక్‌లు , నారావారిపల్లిలో ఎంఎల్ఏ పులివర్తి నాని

**చంద్రగిరి, మార్చి 11 ప్రభాతవార్త:**



భూ సమస్యల శాశ్వత పరిష్కారం చూపిన ఘనత కూటమి ప్రభుత్వం అధినాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతు oదని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని నారావారిపల్లిలో బుధవారం రైతులకు పట్టాదారు పాస్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ముఖ్యమంత్రి అంచెలంచెలుగా అమలుచేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వం జగన్ ఫోటోలను ముద్రించి లోప భూయిష్ట విధానాలతో పట్టాదారు పాస్ పుస్తకాలను అందించడాన్ని ఖండిస్తూ "ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు" చేయనున్నట్లు ప్రకటించి ఆ మేరకు తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతుల భూములను పూర్తి స్థాయిలో రీ సర్వే చేయించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించడం జరిగిందన్నారు. ఆ మేరకు కందులవారిపల్లి పంచాయతీలో 280 మంది రైతులకు రీ సర్వే నిర్వహించి వివాద రహితంగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా మీ భూమిపై మీకు సర్వ హక్కులు కల్పించినట్లు తెలిపారు. రైతుల పట్ల సానుకూల దృక్పధంతో వ్యవహరించిన ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి గిరినాయుడు, ఆర్‌డిఓ రామ్మోహన్, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ అమర్‌నాథ్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, టిడిపి నాయకుడు, క్లాస్ 1 కాంట్రాక్టర్, వ్యాపారవేత్త ఏ.వి.రమణమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి చంద్రగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ పోతల ప్రవీణ్‌కుమార్, క్లసర్ ఇన్‌చార్జ్ దేవీలాల్, పనపాకం క్లస్టర్ ఇన్‌చార్జ్ మేడసాని కుమార్, ముడిపల్లి సురేష్ రెడ్డి, మండల ఉద్యానవన శాఖ అధికారి శైలజ, విఆర్ఓ యజ్ఞశ్రీ, పాల్గొన్నారు.

## క్యాన్సర్‌కు సమగ్ర వైద్య చికిత్సలు



### జాతీయ గైనకాలజిక్ ఆంకాలజీ దినోత్సవంపై అవగాహన

### నారావారిపల్లి సిహెచ్‌సిలో ఎంఎల్ఏ పులివర్తి నాని

**చంద్రగిరి, మార్చి 11 ప్రభాతవార్త:** క్యాన్సర్‌కు సమగ్ర వైద్య చికిత్సలు అందుబాటులో వున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. మండల పరిధిలోని నారావారిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి) లో బుధవారం సూపరిటెండెంట్ డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన జాతీయ గైనకాలజిక్ ఆంకాలజీ దినోత్సవ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ స్విమ్స్ రేడియేషన్ ఆంకాలజీ, అబ్సెట్రిక్స్, గైనకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, పాథాలజీ విభాగాల ఉమ్మడి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించగలిగితే చికిత్సతో నయం చేయవచ్చన్నారు. అనంతరం స్విమ్స్ డైరెక్టర్, వైస్‌ఛాన్సలర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ మహిళలకు పాప్ స్మియర్ పరీక్ష ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించవచ్చన్నారు. హెచ్‌విపి వ్యాక్సిన్ ద్వారా ఈ వ్యాధిని నివారించడానికి అవకాశంవుందన్నారు. ఇందు కోసం పి ంక్ బస్ ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాన్సర్ వ్యాధి గ్రస్థు లకు ఎన్టీఆర్ వైద్యసేవ, ప్రాణదాన ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు సర్పంచ్ లక్ష్మి గిరినాయుడు, ఆర్‌డిఓ రామ్మోహన్, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, డాక్టర్ శివశంకర్, అసిస్టెంట్ డైరెక్టర్ వి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇగ్నోలో పలు కోర్సులకు ధరఖాస్తులు ఆహ్వానం

**తిరుపతి విద్య మార్చి 11 ప్రభాతవార్త.** ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని ఇగ్నో స్టడీ సెంటర్లో పీజీ, యూజీ, డిప్లొమోతో పలు సర్టిఫికేట్ కోర్సులకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వై మల్లి కార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఇగ్నో వెబ్సైట్ ద్వారా ఈనెల 15లోపు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలోని ఇగ్నో స్టడీ సెంటర్ ను సంప్రదించాలని సూచించారు.


కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Together we can

(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
సూళ్లూరుపేట శాఖ, సూళ్లూరుపేట
తిరుపతి జిల్లా

**అమ్మకం ప్రకటన**

**సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన **రుణగ్రహీత రమేష్‌బాబు వీడెల్ల** గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా **అధీకృత అధికారి, సూళ్లూరుపేట శాఖ కెనరాబ్యాంక్ వారు తేది: 26.05.2025 జారీ చేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన బకాయి వున్న మొత్తం రూ.19,76,045.24/- పై లను+వడ్డీ మరియు ఇతర ఖర్చులను** రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై **25.03.2026న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపబడినది.**

**స్థిరాస్తి వివరములు:-** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా - గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా - సూళ్ళూరుపేట సబ్‌జిల్లా, సూళ్ళూరుపేట రెవిన్యూ మండలం - వట్రపాళెం గ్రామం, సూళ్ళూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని పట్టానెం.65, సర్వేనెం.30/1 ఎ.3.05 సెంట్లు, సర్వేనెం.41/1లో ఎ.0.35 సెంట్లు , సర్వేనెం 41/2లో ఎ.0.35 సెంట్లు వెరశి మొత్తం విస్తీర్ణం ఎ.4.20 సెంట్లలో వేసిన లేఅవుట్ ప్లాట్లలో ప్లాటునెం.57 గల ఇంటి స్థలం యొక్క విస్తీర్ణం 57 అంకణముల 21 చ.అ. మరియు ఉత్తరం వైపు ప్లాటు నెం.58 భాగం యొక్క విస్తీర్ణం 39 అంకణముల 22.50 చ.అ. వెరశి మొత్తం విస్తీర్ణం 6955.50చ.అ. లేదా 772 .83 చ.గ.ఒలేదా 646.089 చ.మీ. లేదా 96 అంకణముల 43.50 చ.అ. స్థలం హద్దులు: తూర్పు: వాసంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భూమి, దక్షిణం: ప్లాటు నెం.58 స్థలం పడమర: 25అ. వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.37 & 56 లోని ఖాళీ స్థలం. ఈ హద్దుల మధ్య 6955.50 చ.అ. లేదా 772.83 చ.గ. లేదా 646.089చ.మీ. లేదా 96 అంకణముల 43.50 చ.అ స్థలంలో బిల్డర్ యొక్క రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ పత్రం నెం.821/2015, తేది: 07.04.2025 ప్రకారం లోటస్ పాండ్ పేరుతో నిర్మించిన అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ ఫ్లాట్ నెం.జిన్ యొక్క విస్తీర్ణం 860చ.అ. లేదా 30 చ.గ.(ఎన్‌కంబరెన్స్ స్టేట్‌మెంట్ ప్రకారం) మరియు అవిభ్యాజాటా విస్తీర్ణం 270 చ.అ. లేదా 30 చ.గ. లేదా 25.080 చ.మీ. లేదా 3 అంకణముల 54 చ.అ.లు **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: కామన్ కారిడార్ కొంత భాగం మరియు లిఫ్ట్ కొంత భాగం, ఉత్తరం: ఓపెన్ టు స్కై.

**రిజర్వు ధర : రూ.12,00,000.00** | **ధరావత్తు : రూ.1,20,000.00**

**ధరావతు సమర్పణకు ఆఖరు తేది & సమయం : 23.03.2026 సా.5.00గం||లకు లేదా ఆలోపు.** అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com** లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. లేదా **సీనియర్ మేనేజర్, కెనరాబ్యాంక్, సూళ్లూరుపేట శాఖ, ఫోన్: 919746930929** వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

**ప్రదేశం:సూళ్లూరుపేట, తేది:09.03.2026** | **అధీకృత అధికారి, కెనరాబ్యాంక్**

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Together we can

(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
సూళ్లూరుపేట శాఖ, సూళ్లూరుపేట
తిరుపతి జిల్లా

**అమ్మకం ప్రకటన**

**సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన **రుణగ్రహీత రేబాల రూపకళ మరియు గ్యారంటారు తల్లపనేని ప్రతిమ** గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డు క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా **అధీకృత అధికారి, సూళ్లూరుపేట శాఖ కెనరాబ్యాంక్ వారు తేది: 26.05.2025 జారీ చేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన బకాయి వున్న మొత్తం రూ.19,92,827.22/- పై లను+వడ్డీ మరియు ఇతర ఖర్చులను** రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్ధతిపై **25.03.2026 న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపబడినది.**

**స్థిరాస్తి వివరములు:-** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా - గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా - సూళ్ళూరుపేట సబ్‌జిల్లా, సూళ్ళూరుపేట రెవిన్యూ మండలం - వట్రపాళెం గ్రామం, సూళ్ళూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని పట్టానెం.65, సర్వేనెం.30/1 ఎ.3.05 సెంట్లు, సర్వేనెం.41/1లో ఎ.0.35 సెంట్లు , సర్వేనెం 41/2లో ఎ.0.35 సెంట్లు వెరశి మొత్తం విస్తీర్ణం ఎ.4.20 సెంట్లలో వేసిన లేఅవుట్ ప్లాట్లలో ప్లాటునెం.57 గల ఇంటి స్థలం యొక్క విస్తీర్ణం 57 అంకణముల 21 చ.అ. మరియు ఉత్తరం వైపు ప్లాటు నెం.58 భాగం యొక్క విస్తీర్ణం 39 అంకణముల 22.50 చ.అ. వెరశి మొత్తం విస్తీర్ణం 6955.50చ.అ. లేదా 772 .83 చ.గ.ఒలేదా 646.089 చ.మీ. లేదా 96 అంకణముల 43.50 చ.అ. స్థలం హద్దులు: తూర్పు: వాసంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భూమి, దక్షిణం: ప్లాటు నెం.58 స్థలం పడమర: 25అ. వెడల్పు గల లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.37 & 56 లోని ఖాళీ స్థలం. ఈ హద్దుల మధ్య 6955.50 చ.అ. లేదా 772.83 చ.గ. లేదా 646.089చ.మీ. లేదా 96 అంకణముల 43.50 చ.అ స్థలంలో బిల్డర్ యొక్క రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ పత్రం నెం.1165/2015, తేది: 06.05.2015 ప్రకారం లోటస్ పాండ్ పేరుతో నిర్మించిన అపార్ట్‌మెంట్ 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం.302 యొక్క విస్తీర్ణం 860చ.అ. లేదా 30 చ.గ.(ఎన్‌కంబరెన్స్ స్టేట్‌మెంట్ ప్రకారం) మరియు అవిభ్యాజాటా విస్తీర్ణం 270 చ.అ. లేదా 30 చ.గ. లేదా 25.080 చ.మీ. లేదా 3 అంకణముల 54 చ.అ.లు **3వ అంతస్తులోని ఫ్లాట్ నెం.302కు హద్దులు: తూర్పు:**ఓపెన్ టు స్కై , దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై

**రిజర్వు ధర : రూ.14,00,000.00** | **ధరావత్తు : రూ.1,40,000.00**

**ధరావతు సమర్పణకు ఆఖరు తేది & సమయం : 23.03.2026 సా.5.00గం||లకు లేదా ఆలోపు.** అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ **www.canarabank.com** లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. లేదా **సీనియర్ మేనేజర్, కెనరాబ్యాంక్, సూళ్లూరుపేట శాఖ, ఫోన్: 919746930929** వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

**ప్రదేశం:సూళ్లూరుపేట, తేది:09.03.2026** | **అధీకృత అధికారి, కెనరాబ్యాంక్**

## లోక్ సభ స్పీకర్‌పై తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నాం

**- వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి**

వెంకటగిరి, మార్చి 11 ప్రభాతవార్త: పార్లమెంటులో లోక్‌సభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నట్లు తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో స్పష్టం చేశారు. సభలో మాట్లాడుతూ స్పీకర్ పదవికి, పార్లమెంటు సంప్రదాయాలకు ఉన్న గౌరవాన్ని కాపాడటం కోసమే తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. తమ పార్టీ ఏ కూటమికీ చెందినది కాదని, తాము ఎన్డీయే కూటమిలోనూ లేమని, ఇండియా కూటమిలోనూ లేమని ఆయన పేర్కొన్నారు. సభ గౌరవం, స్పీకర్ స్థానం పరిరక్షణ దృష్ట్యా ఈ విషయంలో తాము స్పష్టమైన వైఖరి తీసుకున్నామని చెప్పారు. సభ హుందాతనాన్ని, పార్లమెంటరీ సంప్రదాయాలను కాపాడాలనే ఉద్దేశంతోనే తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ఆరోగ్యం కోసం క్రీడాల పట్ల శ్రద్ధ చూపాలి



వెంకటగిరి, మార్చి 11 ప్రభాతవార్త: ఆరోగ్యం, ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరు క్రీడలు పట్ల శ్రద్ధ చూపాలని నాయుడుపేట విద్యుత్‌శాఖ ఈఈ వై.శ్రీనివాసులు తెలిపారు. వెంకటగిరి తారకరామా క్రీడా ప్రాంగణంలో రెండు రోజులు జరిగే విద్యుత్ శాఖ ఉద్యోగుల క్రీడాల పోటీలను ఈ ఈ ప్రారంభించారు. ఉద్యోగులందరూ విధినిర్వహణలో ఉండి మానసిక ఒత్తిడికి గురవుతుంటారని ఈ క్రీడల పోటీలో వారికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రెండు రోజులు పాటు ఇక్కడ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు సీనయ్య, వరప్రసాద్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, మార్చి 11 ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల పట్ల సానుభూతితో వ్యవహరించి వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల ఉపకరణాల మదింపు శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ దివ్యాంగుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ వారిని సామాన్య ప్రజలుగా ఉండేలా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునే విధంగా ఈ ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులందరికీ నూరుశాతం అవసరమైన కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, వీల్ చైర్లు, మూడుచక్రాల బండ్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అర్హులను ఎంపిక చేసిన వారికి త్వరలోనే ఈ ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిసి చైర్మన్ ఆకుతోట రమేష్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు మేడా సాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పిడిఎస్ ఓ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ




వెంకటగిరి, మార్చి 11 ప్రభాతవార్త : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేసి ఇరాన్ ముఖ్య నాయకుడు ఖమేనీని హత్య చేయడంతో పాటు 165 మంది పాఠశాల విద్యార్థినులను, వేలాదిమంది పౌరులను దుర్మార్గంగా హత్య చేయడాన్ని పిడిఎస్ఓ ఖండిస్తోందని పిడిఎస్ఓ ఏరియా కన్వీనర్ సిహెచ్ పవన్ అన్నారు. విశాఖపట్నంలో జరిగిన నేవీ డేకి రిహార్సల్ కోసం వచ్చి వెళ్తున్న ఇరాన్ యుద్ధనౌకను అమెరికా పేల్చివేసి 120 మంది నావికా సిబ్బందిని హత్య చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ నాయకులు తేజు, మనోజ్, పవన్, బాలాజీ, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



బాలాయపల్లి, మార్చి 11 ప్రభాతవార్త : మండలం మన్నూరు పాతూరు గ్రామంలో ఓ పూరిల్లులో ఉదయం గ్యాస్ స్టవ్‌పై పాలు కాస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు ఎగిసి పడి పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. దీంతో వెంకటస్వామి, పద్మమ్మ కుటుంబం వీధిన పడింది. కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. ఇంట్లో ఉన్న వస్తువులు, ఫర్నిచర్, నగదు, దస్త్రాలు, మొత్తం కాలి బూడిద అయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. వెంకటగిరి ఫైర్ స్టేషన్ వారికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనను తహసిల్దార్ విజయలక్ష్మి, వీఆర్వోకు సమాచార అందించినట్లు బాధితులు తెలిపారు. రెవిన్యూ సిబ్బంది వచ్చి పరిశీలించారు.

## రెవిన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం!




వాకాడు, మార్చి 11 ప్రభాతవార్త: రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వో నుండి తహసిల్దార్‌తో పాటు జిల్లా కలెక్టర్ వరకు అవినీతి మాయలో అస్తవ్యస్తంగా ఉందని తిరుపతి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం వాకాడులోని ఎస్‌ఏఎల్‌సి ప్రభుత్వ ప్రధాన పాఠశాలలో ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ప్రత్యేకంగా పలు రకాలతో బాధపడుతున్న వారికి అనేక వైద్యాలను తీసుకుని వచ్చిందన్నారు. అందులో భాగంగా దివ్యాంగుల కొరకు పరికరాలను ఏర్పాటు చేసే కార్యక్రమం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా దివ్యాంగులు అందరికీ న్యాయం జరిగే లాగా చర్యలు తీసుకుంటామన్నారు.

## వైసిపి పార్టీని బలోపేతం చేయండి



నాయుడుపేట, మార్చి 11 ప్రభాతవార్త: మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య కార్యాలయానికి మొదటిసారిగా సూళ్లూరుపేట వైస్సార్సీపీ ఇంఛార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి విచ్చేసారు. మొదటిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన ఆయనను నియోజకవర్గ సమన్వయకర్త వైఎస్ఆర్సీపి మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య శాలువా బొకేలతో ఘనంగా స్వాగతించారు. ఆయన మాట్లాడుతూ రేపు జరుగు వైస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలలో సహా ఆరు మండల కేంద్రాలలో అన్ని పంచాయతీలలో ఆవిర్భావ దినోత్సవం జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కామిరెడ్డి రాజారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్, ఓజిలి మండల కన్వీనర్ హరినాథ్ రెడ్డి, చైర్మన్ కటకం దీపిక, వైస్ మల్లికార్జున్ రెడ్డి, కటకం రామయ్య, న్యాయవాదులు వడలవాడ కుమార్ దారా రవి, మహిళా విభాగం రత్నశ్రీ, దొరవారిసత్రం మండల కన్వీనర్ రాహుల్ రెడ్డి మునస్వామి నాయుడు, జాలా రాజగోపాల్, వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సామాగ్రి పంపిణీ

తడ, మార్చి 11 ప్రభాతవార్త: మండలం ఎన్ ఎమ్ కండ్రిగ గ్రామానికి చెందిన ఎన్నారై కామిరెడ్డి రమణారెడ్డి తండ్రి కీర్తిశేషులు కామిరెడ్డి దశరథ రామిరెడ్డి జ్ఞాపకార్థం బుధవారం విద్యార్థులు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. చిన్న మాంబట్టు మాజీ సర్పంచ్ వేనాటి రాజారెడ్డి సూచనలు మేరకు మాంబట్టు హై స్కూల్ నందు విద్యను అభ్యసిస్తున్న 151 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ జామెంట్రీ బాక్స్,పెన్స్, అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామిరెడ్డి మోలి రెడ్డి,మోహన్ రావు, అంకయ్య, కోటయ్య, పెదరాయుడు,వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అప్రదక్షిణంగా వాయులింగేశ్వరుని దర్శించుకున్న పీఠాధిపతి





శ్రీకాళహస్తి,మార్చి 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి దివ్యక్షేత్రం అప్రదిక్షణ క్షేత్రం. అయితే కొంత కాలంగా ఈ సంప్రదాయాన్ని మరుగున పెట్టారు. దక్షిణ గోపురం నుంచి విఐపిలను ఆహ్వానిస్తున్నారు. అయితే బుధవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన శృంగేరి శారదపీఠం పీఠాధిపతి విధుశేఖర్ భారతి మహాస్వామికి అప్రదిక్షణంగా దర్శనం ఏర్పాటు చేసారు. బిక్షాల గాలి గోపురం వద్ద స్వామికి ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయ ఇఒ బికె వెంకటేశు సారథ్యంలో దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారథ్యంలో స్వాగతం ఏర్పాటు చేసారు. కాగా రంగుల గోపురం నుంచి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్స్,పౌరోహితులు అర్థగిరి వేదపండితులు శివప్రసాద్‌శర్మ, మారుతీశర్మ వారి సహచరులతో వేదమంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల సన్నిధిలో అభిషేక దర్శనం చేసుకున్న పీఠాధిపతికి ఆలయ మర్యాదలతో ఫల పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఒ బికె వెంకటేశు, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాథ్, పగడాల మురళి, లక్ష్మమ్మ, సావిత్రి, ప్రోటోకాల్ ఎఇఒ మోహన్, ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, హేమామాలిని, లోకేష్‌బాబు, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, శ్రీహరి, ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి లు పాల్గొన్నారు.

## అవిలాల చెరువును అద్భుతంగా తీర్చిదిద్దుతాం

**-తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి**



తిరుపతిరూరల్, మార్చి11 ప్రభాతవార్త: తిరుపతి నగరానికి పర్యావరణ రక్షనతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించే విధంగా అవిలాల చెఱువును హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో అద్భుతంగా తీర్చిదిద్దుతామని తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. తిరుపతి నగరానికి పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు విశ్రాంతి వినోదం కల్పించేలా అవిలాల చెరువును అన్ని విధాలుగా ఐకాన్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. బుధవారం అవిలాల చెఱువును తుడ చైర్మెన్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్షించి, పలు కీలక సూచనలు చేశారు. తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అవిలాల చెఱువు అభివృద్ధి పనులను అత్యంత వేగంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. చెఱువు, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించే జంగిల్ క్లియరెన్స్ పనులకు మూడు నెలలు సమయం పట్టే పరిస్థితి ఉండగా అధికారుల సమన్వయంతో కేవలం మూడు రోజులలో పూర్తి చేసినట్లు వెల్లడించారు. అవిలాల చెరువుకు పేరూరు, తుమ్మలగుంట చెరువుల నుంచి వచ్చే ఓవర్ ఫ్లో నీటిని, డైరీ ప్రాంతం పశ్చిమ దిశ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతుందని తెలిపారు. సుమారు 157 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెఱువు చుట్టూ 14 మీటర్ల వెడల్పుతో బండ్ (గట్టు) నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ గట్టు కనీస వెడల్పు 3మీటర్లు, ఎత్తు 5మీటర్లుగా ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. అవిలాల చెఱువును కేవలం నీటి నిల్వ ప్రాంతంగా కాకుండా తిరుపతి నగర ప్రజలకు ఒక పర్యాటక వినోద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా చెఱువు చుట్టూ వాకింగ్ ట్రాక్, స్పోర్ట్స్ ఏరియా, ఆకర్షణీయమైన గార్డెనింగ్, విశ్రాంతి మండపాలు వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆశాభావం వ్యక్త చేశారు.ఈ పరిశీలనలో తుడ కార్యదర్శి డాక్టర్ ఎన్.వి. శ్రీకాంత్ బాబు, ఎన్ఇ రవీంద్రయ్య, ఏఇ భవ్య, ఇరిగేషన్ ఇ.ఇ. ప్రసాద్, రెవెన్యూ, తుడ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన

**- జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి భారతి**




చిత్తూరు, మార్చి 11 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి భారతి అన్నారు. ప్రభుత్వ పివికెఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం జిల్లా మహిళా అభివృద్ధి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి భారతి మాట్లాడుతూ సమాజంలో యువత బాధ్యతగా వ్యవహరించడానికి, చట్టాలపై అవగాహన పెంపొందించడానికి, వివిధ రకాల నేరాల నుండి దూరంగా వుండేందుకు విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ప్రతి పౌరుడు సమసమాజ స్థాపన కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. నగర ఇన్స్‌పెక్టర్లు మహేశ్వర్‌మోతూరి, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసులులు మాట్లాడుతూ చిన్నారులపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడానికి పోక్సో చట్టం వుందన్నారు. అలాగే సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తగా వ్యవహరించాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి వెంకటేశ్వరి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి డాక్టర్ పి.జీవన్‌జ్యోతి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నాగేంద్ర, వైస్ ప్రిన్సిపల్ నవనీత, కళాశాల లెక్చరర్లు, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మోతూరి, క్రైం స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వరరావు, మహిళా స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ నిర్మల, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ సుబ్రమణ్యం, కళాశాల లెక్చరర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారుల చొరవతో... చెరకు తరలింపు



రేణిగుంట, మార్చి 11 ప్రభాతవార్త: రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ పంచాయతీ లో రైతులు కోసిన చెరుకు పంట మంగళవారం రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ మంజునాథరెడ్డి తమ సిబ్బందితో దగ్గరుండి తరలించే ఏర్పాట్లు చేశారు. గ్రామానికి చెందిన సుమారు 25 మంది రైతులు తమ పొలాల్లో చెరకు పంట వేశారు. పంటను కోసి తరలించే సమయంలో ఆ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి దారి వివాదం కోర్టులో ఉందంటూ అడ్డుపడ్డాడు. రేణిగుంట తహసిల్దార్ సంఘటన స్థలం చేరుకొని పరిస్థితులను సమీక్షి ంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి సహకారం పంటను తరలించడానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తూ తమకు శాశ్వత దారిని ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ జయ కృష్ణ, వీఆర్వో హేమంత్, రెవిన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. చెరుకు పండించిన రైతుల పంటను పూర్తిగా తరలించే వరకు వివాదాస్పద స్థలంలో రెవిన్యూ అధికారుల పర్యవేక్షణలో పోలీసులను మోహరింప చేస్తామని తహసిల్దార్ తెలిపారు.

## ఎంపీ మిధునయ్య... కోడూరు రాజకీయం ఏందయ్యా!

**-ఎటు పోవాలో దిక్కు తెలియక కార్యకర్తలు**



రైల్వే కోడూరు, మార్చి 11 ప్రభాతవార్త : రాజంపేట పార్లమెంటు సభ్యులు మిధునయ్య రైల్వే కోడూరు రాజకీయం ఏందయ్యా అంటూ కార్యకర్తలు అనుమానాలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికలలో రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానం ఓడిపోయినప్పటి నుంచి కార్యకర్తలను నిబద్ధత, సచ్చిలత ఉన్న కార్యకర్తలు ఏ వర్గంలోకి వెళ్లాలో పార్టీలో ఉండాలా వద్దా అన్న ఆలోచనలు కార్యకర్తలలో రేకెత్తిస్తున్నాయి. పూర్తిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి 16 వా ఏడాదిలోకి వెళ్లిన సందర్భంలో కార్యకర్తలు ఎవరి వద్దకు వెళ్లాలో ఏమి చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి పులివెందల తర్వాత రెండవ కన్నుగా ఉన్న రైల్వే కోడూరును పూర్తిగా పట్టించుకోకుండా ఉండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ఐదు మండలాలకు చెందిన నాయకులలో కార్యకర్తలలో అయోమయం నేలకొందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పంచాయతీ ఎన్నికలు కావచ్చు స్థానిక అసెంబ్లీ ఎన్నికలు కూడా తెలుగుదేశం పార్టీకి గాని కూటమి పార్టీకి గాని అనుకూలంగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్ద రెడ్డి మిథన్‌రెడ్డిని ఎంతోమంది ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసిన బహిరంగంగా రైల్వే కోడూరు రాజకీయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారో లేదో అన్న అనుమానాల కూడా బహిరంగంగా వినవస్తున్నాయి. రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎవరు ఎలా ఉంటారు ఏ పార్టీకి వెన్ను దన్నుగా ఉండాలో అన్నలను కూడా అనుమానాలను కూడా మాజీలు కాబోతున్న సర్పంచులు కూడా సమావేశంలో మునిగి తేలుతున్నారు. దీనిపై రాజంపేట పార్లమెంట్ సభ్యులు దృష్టి సారించి కార్యకర్తలతో చర్చించి గట్టి నిర్ణయాన్ని తీసుకోకుంటే కూటమి ప్రభుత్వం రైల్వే కోడూరులో జెండా ఎగరవేసే పరిస్థితులు మెండుగా ఉన్నాయి.

# సూళ్ళూరుపేట డివిజన్

## 14వ తేదీ లోక్ అదాలత్

**- జూనియర్ సివిల్ జడ్జ్ విష్ణువర్మ**



వెంకటగిరి, మార్చి 11 ప్రభాతవార్త: ఈ నెల 14వ తేదీ జరగబోవు లోక్ అదాలత్‌కు కేసుల రాజీ చేయించడమే లక్ష్యమని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందితో కోర్టులో సమావేశం నిర్వహించారు. 14వ తేదీ లోక్ అదాలతో 5వేల కేసులు రాజీ చేయడమే లక్ష్యం అని చెప్పారు. బ్యాంకు కేసులు, సునీల్, క్రిమినల్ తదితర కేసుల్లో రాజి చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ ఏవి రమణ, ఎస్సైలు ఏడుకొండలు, శివశంకర్, లోక్ అదాలత్ సభ్యులు రాజేష్, న్యాయవాదులు లక్కమనేని కోటేశ్వరరావు, రాజారావు, రాంప్రసాద్, విజయ్ కుమార్, కిషోర్, చెంచు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



బాలాయపల్లి, మార్చి 11 ప్రభాతవార్త: మన్నూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి, పద్మమ్మల పూరి గుడిసె అగ్నికి ఆహుతి కావడంతో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయి సత్యం నాయుడు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు జడపల్లి కోటేశ్వర్ గౌడ్ నగదు,బియ్యం, నిత్యవసర సరుకులను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. అగ్ని ప్రమాదం విషయాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అగ్ని బాధ్యత కుటుంబానికి ఎమ్మెల్యే ద్వారా కూడా తమ సహాయాన్ని చేస్తామని చెప్పారు.

## ఎన్టీఆర్ విగ్రహం నిర్మాణానికి సహాయం

బాలాయపల్లి, మార్చి 11 ప్రభాతవార్త: బాలాయపల్లికి చెందిన తాళ్లూరు ప్రసాదు నాయుడు బాలాయపల్లిలో నిర్మించే ఎన్టీఆర్ విగ్రహానికి 25000 రూపాయిలను విరాళం అందజేసినట్లు మండల టిడిపి అధ్యక్షులు రాయి సత్యం నాయుడు తెలిపారు. సిద్ధగుంట గ్రామానికి చెందిన పెట్లూరు జనార్దన్‌రెడ్డి 25116 రూపాయలు అందజేసినట్లు చెప్పారు. ఎన్టీఆర్ విగ్రహానికి దాతలు విరివిగా విరాళాలు ఇవ్వాలని సూచించారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బాలాయపల్లి, మార్చి 11 ప్రభాతవార్త: ఈ నెల 12న ఉదయం 10.30 గంటలకు వెలుగు సమావేశ మందిరం నందు ఎంపిపి గూడూరు భాస్కర రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఓ డి.జె. వినీల్ కుమార్ తెలిపారు. వైద్య ఆరోగ్య, త్రాగునీరు, గృహ, వ్యవసాయ, ఉపాధిహామీ పథకం, రోడ్లు, సంక్షేమ, విద్యుత్ ఇంకా పలు సమస్యలపై సమావేశంలో చర్చిస్తారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు సమావేశంకు హాజరు కావాలని కోరారు.

## కూటమిలో దివ్యాంగులకు బహుళ ప్రయోజనాలు

**- టిడిపి మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి**




వాకాడు, మార్చి 11 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు అనేక బహుళ ప్రయోజనాలు కల్పిస్తున్నారని టిడిపి మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వాకాడులో ఎస్ఏఎల్‌సి ప్రభుత్వ పాఠశాలలో సామాజిక సాధికారిక మంత్ర శాఖ భారత ప్రభుత్వం సౌజన్యంతో దివ్యాంగులకు వైద్య శిబిరం ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ముందస్తుగా వైద్య పరికరాలు అందించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, మాజీ కన్వీనర్ దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, దివ్యాంగుల గురించి పూర్తిస్థాయిలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకుడు, శాలివాహన మాజీ డైరెక్టర్ కోట శ్రీనివాసులు, చిట్టమూరు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, ప్రతిభ రాణి, వైదధికారి తులసీ రామ్, నాయకులు తిరుమూరు శ్రీనివాసులరెడ్డి, గోపినాయుడు, ధనుంజయ, వివిధ శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఉన్నారు. దివ్యాంగులకు చికిత్సలు చేస్తున్న కార్యక్రమంను మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అజిత్ కుమార్ రెడ్డి, నాయకులు, అధికారులు పరిశీలించారు.

## విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలి : డీఈవో



వడమాలపేట, మార్చి 11 ప్రభాతవార్త: పదో తరగతి విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని, భయం లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలోని యనమలపాళెం గ్రామంలో పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని తెలుసుకునే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల స్థాయిని పరిశీలించేందుకు ఉపాధ్యాయులతో కలసి బుధవారం రాత్రి విద్యార్థుల ఇళ్ళను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులను వారి ఇళ్ళ వద్దే కలుసుకుని సబ్జెక్టులపై వారి అవగాహనను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు నేర్చుకున్న పాఠాలను పునశ్చరణ చేసుకుంటూ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీతారామపురం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో బ్యాండు మేళం చిత్రబృందం



కాణిపాకం, మార్చి 11 ప్రభాతవార్త: బ్యాండు మేళం తెలుగు చిత్ర బృందం బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ఈమేరకు చిత్ర హీరో హర్ష్ రోషణ్, హీరోయిన్ శ్రీదేవి, ప్రముఖ రచయిత కోన వెంకట్, కామెడి యాక్టర్ అవినాష్‌లు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నల్లగంగమ్మ జాతర సంబరాలు



శ్రీకాళహస్తి,మార్చి 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి బహాదూరుపేటలో నల్లగంగమ్మ జాతర సంబరాలు బుధవారం మిన్నుముట్టాయి. మంగళవారం రాత్రి కన్నుల పండువగా అమ్మవారిని ముస్తాబు చేసారు. కమిటి సభ్యుల పర్యవేక్షణలో ఊరేగింపు జరిపారు. శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి సారథ్యంలో సిఐ ప్రకాష్‌కుమార్ సారథ్యంలో ఎలాంటి వివాదాలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేసారు.అంతేకాక కమిటి సభ్యులు కూడా పోలీసులతో సహాకరించటంతో ప్రశాంతంగా జాతర నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారిని స్థావరం వద్ద ప్రతిష్టించారు. అక్కడ ఉదయం నుంచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భక్తి శ్రద్దలతో నిమజ్జనానికి తరలించారు. వేసవి కాలం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో,పట్టణంలో జాతర సంబరాలు నిర్వహించటం ఆనవాయితి. వేసవి కాలంలో జాతర సంబరాలు బహాదూరుపేటలో వెలసిన నల్లగంగమ్మ జాతర నుంచి ప్రారంభమౌతాయి. ఇక్కడ జాతర కమిటి చైర్మెన్ కంఠా రమేష్ సారథ్యంలో జాతర నిర్వహిస్తున్నారు. అమ్మవారిని అలంకరించటంలో కమిటికి చెందిన గుణ ప్రత్యేక శ్రద్ద వహిస్తున్నారు. కమిటి చైర్మెన్ కంఠా రమేష్ సారథ్యంలో సభ్యులు ప్రదీప్‌రెడ్డి, అనిల్, ఢిల్లిబాబు, గుణశేఖర్, పి.నారాయణ, నక్కా రాజేంద్ర, కపిల్ అనే వెంకటేష్,మండల యాదగిరి సుబ్రమణ్యం, శంకరయ్య,రాంబాబు పాల్గొన్నారు. భక్తి శ్రద్దలతో అమ్మవారికి చైర్మెన్ సారథ్యలో పట్టు వస్త్రాలను అందించారు.